



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 255 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శనివారం 06 జూన్ 2026 | పేజీలు : 12 | వెల : 2/-


### బ్లూ ఎకనామితోనే

# భవిష్యత్ - ఆర్థికాభివృద్ధి సాధ్యం

- రాష్ట్రంలో ఆక్వా రంగాభివృద్ధికి ఎకో సిస్టం - 6 ప్రాంతాలు కలుపుతూ కారిడార్
- కేంద్ర మత్స్య శాఖ ప్రాంతీయ కార్యాలయానికి 15 రోజుల్లో భూకేటాయింపులు
- దేశాన్ని అగ్రపథాన నిలిపేలా అద్భుతంగా పని చేస్తున్న ప్రధాని మోదీ
- సీ-ఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్ షాప్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు
- కేంద్ర మంత్రులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించిన సీఎం
- రూ.72 కోట్లతో కాకినాడ పోర్ట్ ఆధునీకరిస్తామన్న కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో ఆక్వా రంగం అభివృద్ధికి అవసరమైన ఎకో సిస్టం ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఆక్వా రంగానికి భారతదేశం లైట్ హౌస్‌లా ఉంటే... దానికి ఏపీని కేంద్ర బిందువు చేస్తామన్నారు. అమరావతి, భీమవరం, కాకినాడ, విశాఖపట్నం, కృష్ణపట్నం, నెల్లూరు ప్రాంతాలను కలుపుతూ ఆక్వా కారిడార్ అభివృద్ధి చేస్తామని సీఎం ప్రకటించారు. ఈ కారిడార్లో ఆక్వా అభివృద్ధికి అవసరమైన రీసెర్చ్, ఇన్నోవేషన్, స్టార్టప్స్, టెక్నాలజీని అందుబాటులోకి తెస్తామని తెలిపారు. అతి తక్కువ వ్యయంతో అత్యధిక ఉత్పత్తి సాధించడమే లక్ష్యమని చెప్పారు. ఆక్వా ఉత్పత్తులకు సంబంధించిన ఉప ఉత్పత్తులతో కూడా ఆర్థిక ప్రగతి సాధించవచ్చన్నారు. శుక్రవారం విశాఖలో జరిగిన సీ-ఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్ షాప్‌లో ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'ఆంధ్రా ష్రింప్, ఇండియా సీ-ఫుడ్' బ్రాండ్ ఎస్టాబ్లిష్ చేస్తున్నామని చెప్పారు. ఆక్వా రంగ అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిన నాలుగు శాఖలకు చెందిన కేంద్ర మంత్రులు ఒకే వేదికపై రావడం శుభపరిణామంగా అభివర్ణించారు.

**రాష్ట్రంలో మెగా సీ-ఫుడ్ ప్రాసెసింగ్ పార్కులు**

'రూ. 72 కోట్లతో కాకినాడ పోర్ట్ మోడ్రనైజేషన్ చేపడతామని కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రకటించినందుకు సంతోషం. కేంద్ర మత్స్య శాఖకు ప్రాంతీయ కార్యాలయానికి అవసరమైన స్థలాన్ని 15 రోజుల్లో కేటాయిస్తాం. నెల రోజుల్లో కార్యాలయానికి శంకుస్థాపన చేసి నిర్మాణం ప్రారంభించాలని కేంద్రాన్ని కోరుతున్నాను. ఆక్వా ఉత్పత్తులను మరింత పెద్ద స్థాయిలో ఎగుమతులు చేసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఆక్వా రంగ అభివృద్ధికి కేంద్రం తీసుకునే చర్యలకు రాష్ట్రం వైపు నుంచి పూర్తి సహకారం ఉంటుంది. మెగా సీ-ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు కేంద్రం సహకరిస్తామని ఇప్పటికే చెప్పింది. వికసిత్ భారత్ లక్ష్యాలు చేరుకోవడానికి బ్లూ ఎకానమీ ఎంతో కీలకం. పాండ్ టు పోర్టు, ఫార్మర్ టు గ్లోబల్ కన్స్యూమర్, బ్లూ ఎకానమీ టు వికసిత్ భారత్ అనే విధానంతో పని చేయాలి. భారత ఆశలను... ఆశయాలను మిగతా .. 2లో..

## పర్యావరణం- ఆరోగ్య హితం కోసం సైకిల్

### తిరుగు ప్రయాణంలోనూ సైకిల్‌పై సీఎం చంద్రబాబు



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఎం చంద్రబాబు తన తిరుగు ప్రయాణంలోనూ సైకిల్ పై హెలిపాడ్ వరకూ ప్రయాణించారు. నోవోటెల్ హోటల్ నుంచి బీచ్ రోడ్డు మీదుగా వైఎంసీఏ, వుడాపార్కు సర్కిల్ , పోలమాంబ గుడి మీదుగా ఏయూలోని ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్ దగ్గర ఏర్పాటు చేసిన హెలిపాడ్ కు సైకిల్ పై ప్రయాణించారు. 5.5 కిలోమీటర్ల దూరాన్ని 17 నిమిషాల్లో సీఎం చేరుకున్నారు. దారిలో ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముఖ్యమంత్రి ముందుకు సాగారు. పర్యావరణ హితంతో పాటు వ్యక్తిగత ఆరోగ్యం కోసం సైకిల్ వినియోగించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. విశాఖ సుందరమైన నగరమని.. ఇలాంటి నగరంలో సైకిల్ పై ప్రయాణించటం మరింత ఆహ్లాదం కలిగిస్తుందని సీఎం పేర్కొన్నారు. విశాఖలో సైకిల్ పాత్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తామని సీఎం వివరించారు. కాలుష్య రహితంగా మన రాష్ట్రాన్ని తయారు చేసేందుకు ఉద్దేశించిన నెట్ జీరో కార్యక్రమానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. ఏ కార్యక్రమం ప్రారంభించినా మిగతా .. 2లో..

### 2.5కోట్ల సీడ్ బాల్స్

# తయారు చేయడమే లక్ష్యం

### ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈ నెల 15 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 2.5కోట్ల సీడ్ బాల్స్ తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. ప్రతి సీడ్ బాల్‌కు ఒక చెట్టును సృష్టించగలిగే శక్తి ఉంటుందన్నారు. ఎన్టీఆర్ జిల్లా మూలపాడు బటర్‌ఫ్లై పార్క్‌లో ఏర్పాటు చేసిన ప్రపంచ పర్యావరణ దినోత్సవం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సీడ్‌బాల్స్ తయారు చేశారు. "ప్రతి చెట్టు వాతావరణ మార్పుల ప్రభావం నుంచి భూమిని కాపాడుతుంది. సీడ్ బాల్స్‌ను అడవులు, కొండ ప్రాంతాలు, నదీ తీరాల్లో వెదజల్లే ఏర్పాటు చేస్తున్నాం. మనుషులు వెళ్లలేని ప్రాంతాల్లో డ్రోన్ సాయంతో సీడ్ బాల్స్‌ను జల్లుతాం. మొక్కల సంరక్షణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి. మొక్కలు నాటడం అలవాటుగా చేసుకోవాలి. నాటడమే కాదు.. వాటిని సంరక్షించడం కూడా కీలకమే" అని పవన్ కల్యాణ్ అన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### మెగా డీఎస్సీలో ఎక్కడా

# నిబంధనలు ఉల్లంఘించలేదు

### ఏపీ ప్రభుత్వ అధికారులు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** మెగా డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించామని ఏపీ ప్రభుత్వ అధికారులు స్పష్టం చేశారు. డీఎస్సీ నియామకాలపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ మీడియాతో మాట్లాడుతూ వివరణ ఇచ్చారు. డీఎస్సీ ప్రక్రియలో నియమ, నిబంధలన్నీ పాటించినట్లు చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు మిగతా .. 2లో..

### 22ఎ భూముల సమస్యకు విముక్తి కల్పించడం

# ఎంతో తృప్తినిచ్చింది

### అర్హులైన ప్రతి లబ్దిదారునికి సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు కొనసాగుతాయి
### రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి, జిల్లా ఇంఛార్జి మంత్రి నాదెండ్ల మనోహార్



**ఏలూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో ఎంతో కాలంగా రైతులు, సామాన్యులు ఎదురుచూస్తున్న 22ఎ భూముల సమస్యకు ప్రభుత్వం విముక్తి కల్పించడం ఎంతోమందికి భారీ ఊరటనిచ్చిందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి, జిల్లా ఇంఛార్జి మంత్రి నాదెండ్ల మనోహార్ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జరిగిన జిల్లా సమీక్షాకమిటీ సమావేశం అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వ రికార్డుల్లో నిషిద్ధ జాబితా(22ఎ) లో చిక్కుకున్న భూములకు విముక్తి కల్పించేందుకు చేపట్టిన చర్యల్లో బాగంగా ఏలూరు జిల్లాలో ఇంతవరకు 1749 మంది లబ్దిదారులకు చెందిన 917 ఎకరాలు 22ఎ జాబితానుండి తొలగించడం తనకు ఎంతో సంతతృప్తినిచ్చిందన్నారు. ఈ విషయంపై రెండు సార్లు మెగా గ్రీవెన్స్ డే నిర్వహించి ప్రజల దగ్గర అర్జీలు స్వీకరించి అదే రోజున పరిష్కార చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, రెవిన్యూ అధికారులు అహర్నిశలు కృషి చేసినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. కైకలూరులో 500 ఎకరాలు మిగతా .. 2లో..

### మేం అధికారంలో ఉన్నప్పుడు

# పేపర్ లీక్‌లు జరగలేదే?

### ఆప్ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్




**విశ్వం వాయిస్ న్యూస్ :** దేశంలో తరచూ తలెత్తుతున్న ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారాలపై ఆప్ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మరో సారి మండిపడ్డారు. ప్రశ్నాపత్రాల లీక్ వెనుక బిలియన్ల విలువ చేసే వ్యాపారాలు నడుస్తున్నాయని.. ఇందులో చాలా పెద్ద వ్యక్తుల హస్తం ఉందని ఆరోపించారు. భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే ప్రతి మూడేళ్లకు ఒకసారి పేపర్ లీక్‌లు ఎందుకు అవుతున్నాయని ప్రశ్నించారు. పంజాబ్‌లో ఆప్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లైనా ఒక్క లీక్ కూడా జరగలేదన్నారు. తమ పార్టీ దిల్లీలో అధికారంలో ఉన్న పదేళ్లపాటు అక్కడ కూడా ఎటువంటి లీక్‌లు చోటుచేసుకోలేదని తెలిపారు. భాజపా అధికారంలోకి రాగానే ఈ లీక్‌లు మిగతా .. 2లో..

### ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో

# కాకినాడ రెవెన్యూ ఉద్యోగిపై ఏసీబీ దాడులు

### సుమారు 20 కోట్లకు పైగా ఆస్తులు ఉన్నట్టు గుర్తింపు





**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ / మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చోడవరపు శివ రామ్ కుమార్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసిన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం విస్తృత స్థాయిలో సోదాలు నిర్వహించారు. రాజమహేంద్రవరం రేంజ్ ఏసీబీ అధికారులు క్రైమ్ నెం. 06/RCA-RJY/2026గా కేసు నమోదు చేసి, అవినీతి నిరోధక (సవరణ) చట్టం-2018లోని సెక్షన్ 13(1)(బి), 13(2) కింద మిగతా .. 2లో..

### జనసేన రాజ్యసభ అభ్యర్థిగా


# లింగమనేని రమేష్ ఖరారు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** జనసేన రాజ్యసభ అభ్యర్థిగా పారిశ్రామిక వేత్త లింగమనేని రమేశ్ పేరు ఖరారైంది. రాజ్యసభ అభ్యర్థిత్వంపై పార్టీ అధినేత పవన్ కల్యాణ్ నిర్ణయం తీసుకున్నట్లు జనసేన ప్రకటించింది. ఈ మేరకు పవన్ రాజకీయ కార్యదర్శి హరిప్రసాద్ వెల్లడించారు. "లింగమనేని రమేశ్‌కు 2015 నుంచి జనసేనతో అనుబంధం ఉంది. రాష్ట్రం అభివృద్ధి చెందాలనే పవన్ మిగతా .. 2లో..

### వైకాపా మాజీ ఎమ్మెల్యే

# బొల్లా బ్రహ్మనాయుడు అరెస్ట్



**విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ శివారు గండిపేటలో రూ.వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు కాజేసేందుకు నకిలీ జీవోలు సృష్టించిన కేసులో వైకాపా మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అరెస్ట్ అయ్యారు. గత కొన్ని రోజులుగా పరారీలో ఉన్న ఆయన్ను తమిళనాడులోని కాంచీపురంలో సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ శివారు గండిపేటలో 9 ఎకరాల 28 గుంటల సర్కారు భూమిని కొట్టేసేందుకు బ్రహ్మనాయుడు తెర వెనుక మంత్రాంగం నడిపించినట్లు సైబరాబాద్ పోలీసుల దర్యాప్తులో తేలింది. రంగారెడ్డి జిల్లా గండిపేట గ్రామం సర్వే నంబరు 18లోని ప్రభుత్వ భూమికి సంబంధించి మిగతా .. 2లో..

### పాలమూరు-రంగారెడ్డి పనులతో

# కేసీఆర్ ఇంట్లో కనకవర్షం

### తెలంగాణా సీఎం రేవంత్‌రెడ్డి



**కరివెన, విశ్వం వాయిస్ న్యూస్ :** బీఆర్ఎస్ హయాంలో కమీషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాజెక్టులను సందర్శిస్తున్న సీఎం.. రెండోరోజు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. అనంతరం కరివెన రిజర్వాయర్ వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో మిగతా .. 2లో..

### రజనీకాంత్ తనతో

# చేతులు కలపమన్నారు : అన్నామలై




**విశ్వం వాయిస్ న్యూస్ :** తమిళనాడు రాజకీయాల్లో కొంతకాలంగా ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇంతకాలం సీఎం విజయ్‌పై ఉన్న దృష్టి.. ఇప్పుడు అన్నామలై వైపు మళ్లింది. ఆయన ఇప్పటికే భాజపాను వీడగా.. తన రాజకీయ భవిష్యత్తు గురించి తాజాగా మీడియాతో మాట్లాడారు. ఈసందర్భంగా ప్రముఖ నటుడు రజనీకాంత్ ప్రస్తావన తెచ్చారు. తనతో చేతులు కలపమని గతంలో మిగతా .. 2లో..

### ఎస్‌యూ-57ను

# కలిసి రూపొందిద్దాం..

### భారత్‌కు పుతిన్ బిగ్ ఆఫర్



**విశ్వం వాయిస్ న్యూస్ :** వైమానిక దళాన్ని బలోపేతం చేసే దిశగా ఐదో తరం యుద్ధ విమానాన్ని అమ్ముల పొదిలో చేర్చుకునేందుకు భారత్ ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ నుంచి బిగ్ ఆఫర్ వచ్చింది. అధునాతన స్టెల్త్ సామర్థ్యాలు కలిగిన సుఖోయ్ ఎస్‌యూ-57 యుద్ధ విమానాలను భారత్‌తో కలిసి సంయుక్తంగా మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# పర్యావరణం- ఆరోగ్య హితం కోసం సైకిల్

విశాఖ వాసులు విజయవంతం చేస్తారని .. వివిధ సందర్భాల్లో నగర వాసులు తనకు అండగా నిలబడ్డారని సీఎం అన్నారు. విశాఖకు మరిన్ని పెట్టుబడులు తీసుకురావటం ద్వారా రుణం తీర్చుకుంటానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విశాఖను నాలెడ్జ్ హబ్ గా చేయాలని ప్రయత్నిస్తుంటే కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని వచ్చే రోజుల్లో అనేక అవకాశాలకు విశాఖ కేంద్రం అవుతుందని సీఎం అన్నారు. వివిధ ప్రాజెక్టులతో సమీప భవిష్యత్తులోనే అనేక అవకాశాల కేంద్రంగా విశాఖ రూపుదిద్దు కుంటుందన్నారు. త్వరలోనే పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి చేసి విశాఖకు గోదావరి నీళ్లు తీసుకువస్తామని అన్నారు. విశాఖను మరింత సుందరంగా తీర్చిదిద్దటంతో పాటు సంపద సృష్టికి కేంద్రంగా మారుస్తామన్నారు.

# బ్లూ ఎకానమీతోనే భవిష్యత్ - ఆర్థికాభివృద్ధి సాధ్యం

నెరవేర్చేందుకు ఏపీ బ్లూ ఎకానమీ దోహదపడుతుందని భావిస్తున్నా. ప్రపంచ వ్యాప్తంగా జరిగే సీ-ఫుడ్ బిజినెస్‌లో ఇండియా వాటా కేవలం 5 శాతం మాత్రమే ఉంది. ఈ రంగంలో ఇండియాకు పెద్దఎత్తున అవకాశాలు ఉన్నాయి.' అని ముఖ్యమంత్రి అన్నారు.

**ఏటా రూ.28,000 కోట్ల ఎగుమతులు**

'భవిష్యత్ అంతా బ్లూ ఎకానమీదే. బ్లూ ఎకానమీ ద్వారా ఆర్థిక వృద్ధి సాధ్యం. నీరు ఉన్న చోట నాగరికతలు విలసిల్లుతాయి... ఏపీలో గోదావరి, కృష్ణ వంటి జీవ నదులు ఉన్నాయి. సీ-ఫుడ్ ఉత్పత్తిలో ఏపీ రెండో అతి పెద్ద రాష్ట్రం. 197 లక్షల మెట్రిక్ టన్నుల సీ-ఫుడ్ ఉత్పత్తి ఏపీలో జరుగుతోంది. ఏపీలో బ్లూ ఎకానమీ పెరిగితే... దేశ ప్రగతికి దోహద పడుతుంది. భారతదేశం మొత్తం చేపల ఉత్పత్తిలో ఏపీ వాటా 28 శాతంగా ఉంది. భారతదేశం మొత్తం రొయ్యల ఉత్పత్తిలో ఏపీ షేర్ 66 శాతం. భారతదేశం మొత్తం సముద్ర ఆహార ఎగుమతుల్లో దాదాపు ఏపీ నుంచే 38 శాతం ఆదాయం వస్తోంది. సంవత్సరానికి రూ.28,000 కోట్లకు పైగా సముద్ర ఆహార ఎగుమతులు ఏపీ నుంచే జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందితే, భారతదేశ సముద్ర ఆహార ఎగుమతులు కూడా అభివృద్ధి చెందుతాయి. ఆక్వా రంగంలో ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణలు చేస్తే, భారతదేశ బ్లూ ఎకానమీ నిస్సందేహంగా ముందుకు సాగుతుంది. ఏపీలో 1,053 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది. ఏపీకి పోర్టులు, ఎయిర్ పోర్టులు ఉన్నాయి. ఏ రంగం, ఏ ఉత్పత్తి అయినా సక్సెస్ కావాలంటే క్వాలిటీ, సస్టైనబుల్టీ, ట్రేసబులిటీ, ఇన్నోవేషన్, జీరో పొల్యూషన్ అనేది ముఖ్యం. సీ-ఫుడ్ ఎగుమతుల అభివృద్ధికి ప్రతీ స్టేక్ హోల్డర్ బాధ్యత తీసుకోవాలి, సహకరించాలి.' అని సీఎం అన్నారు.

**ప్రధాని మోదీని మరింత బలపరుద్దాం**

'ఆక్వా పరిశ్రమలో ఇన్నోవేషన్లు చేసే వారిని ఆంధ్రప్రదేశ్ ఆహ్వానిస్తోంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో ఏపీ పని చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెడితే.. ఆ పెట్టుబడులకు ప్రోత్సాహమిచ్చి... అభివృద్ధి చేస్తాం. ఆక్వా ఉత్పత్తులతో చక్కటి ఆరోగ్యం లభిస్తుంది. ప్రజలు ఇప్పుడు ప్రొటీన్ ఉత్పత్తులనే ఆహారంగా తీసుకుంటున్నారు. ఆక్వా ఉత్పత్తుల్లో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది. ప్రొటీన్ ఫుడ్ తీసుకోవడంతోపాటు... ప్రతీ రోజూ సైకిలింగ్ చేయాలి. ఇవాళ ఈ సమావేశానికి సైకిలింగ్ చేసుకుంటూనే వచ్చాను. సైకిలింగ్ ద్వారా ఆరోగ్యం బాగుంటుంది... ఖర్చులూ తగ్గుతాయి. సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యమిస్తున్నాం. సరైన సమయంలో సరైన నేత నరేంద్ర మోదీ ప్రధానిగా ఉండటం అదృష్టం. 21వ శతాబ్దం నరేంద్ర మోదీదే... భవిష్యత్తులో భారత దేశాన్ని అగ్ర భాగంలో నిలపడానికి ప్రధాని మోదీ అద్భుతంగా పని చేస్తున్నారు. ప్రధానిగా 12 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న మోదీని మరింత బలపర్చాల్సిన అవసరం ఉంది.' అని సీఎం చెప్పారు.

**కొత్త మార్కెట్లకు భారత ఆక్వా ఉత్పత్తులు**

ఆక్వా రంగం అభివృద్ధిపై కేంద్ర మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు ఉమ్మడి ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆక్వా రంగం విషయంలో కేంద్ర ప్రభుత్వం సంక్షోభం నుంచి అవకాశాలను అన్వేషిస్తోందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చెప్పారు. అమెరికా టారిఫ్‌లు విధించినప్పటికీ... గతేడాది కంటే మిన్నగా ఆక్వా ఎగుమతులు చేసుకోగలిగామని, అంతర్జాతీయంగా కొత్త మార్కెట్లకు భారత ఆక్వా ఎగుమతులు వెళ్లాయన్నారు. ఇప్పుడు మన ఆక్వా ఉత్పత్తులకు మరిన్ని మార్కెట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఆక్వా ఎగుమతులతో ఆర్థికాభివృద్ధితో పాటు.. మత్స్యకారులకు చాలా ఉపయోగపడుతుందన్నారు. మోడ్రనైజ్డ్ బోట్లను మత్స్యకారులకు అందించడానికి సిద్ధంగా ఉన్నామని, 200 మోడ్రనైజ్డ్ బోట్లు ఏపీకి వస్తున్నాయని చెప్పారు. ప్రజల ఆహార అలవాట్లు మారాయని, ప్రొటీన్ ఆహారాన్ని అధికంగా తీసుకుంటున్నారని... దీంతో ప్రొటీన్ ఎక్కువ ఉండటం వల్ల ఆక్వా ఉత్పత్తులకు రోజు రోజుకూ డిమాండ్ పెరుగుతోందన్నారు.

**సీ-ఫుడ్ ప్రాసెసింగ్‌లో విస్తృత అవకాశాలు**

ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి మాట్లాడుతూ...'ఆక్వాలో కేవలం 12 శాతం మాత్రమే ప్రాసెసింగ్ చేస్తున్నాం... సీ-ఫుడ్ ప్రాసెసింగ్ విషయంలో మరింత అభివృద్ధి చేయాలి. ఆక్వాలో టెక్నాలజీ, ఇన్నోవేషన్లకు పెద్ద పీట వేయాలి. వ్యవసాయంతో పోల్చుకుంటే ఆక్వాలో ఎక్కువ అభివృద్ధి కనిపిస్తోంది. ఆక్వాకు రూ.1.50కే విద్యుత్ ఇస్తున్నాం. ఫిష్ ఫీడ్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఫిష్ మీల్ ఎగుమతులను 50 శాతానికి పరిమితం చేయాలని కోరుతున్నాం. సోయా విషయంలోనూ కేంద్రం నుంచి సహకారం అవసరం. ఇతర దేశాలతో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్లు జరగాల్సి ఉంది.. దీనికి కేంద్రం ఇప్పటికే సహకరిస్తోంది. ప్రపంచంలోని ప్రతీ కిచెన్‌లోకి ఇండియన్ ఆక్వా ఉత్పత్తులు వెళ్లేలా కేంద్రం ప్రణాళికలు రూపొందించడం సంతోషంగా ఉంది.' అని అన్నారు.

**సర్క్యులర్ ఎకానమీతో 'ఆక్వా' అనుసంధానం**

'పీఎంఎంకేఎస్ఎస్‌వై పథకాన్ని ఏపీలో అమలు చేస్తాం... విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో సమస్యలు ఉంటే పరిష్కరిస్తాం... ఏడాది 30 బిలియన్ యూఎస్ డాలర్ల విలువైన ఎగుమతులు చేసేలా కేంద్ర ప్రభుత్వ లక్ష్యం పెట్టుకుంది. కేంద్రం నిర్దేశించుకున్న లక్ష్యంలో 30 శాతం ఏపీ వాటా ఉంటుందని హామీ ఇస్తున్నాం. సర్క్యులర్ ఎకానమీకి ఆక్వా రంగాన్ని అనుసంధానం చేసేలా భీమవరంలో ప్రాజెక్టులకు కేంద్రం సహకారం అందిస్తోంది. మార్కెట్ ఇబ్బందులతో మద్దతు ధర కోల్పోయిన వివిధ పంటల రైతులను ఆదుకోవాలని కేంద్రాన్ని కోరుతున్నాం. ప్రపంచవ్యాప్తంగా భారత దేశానికి గౌరవం దక్కడానికి కారణం ప్రధాని నరేంద్ర మోదీనే. చాలా దేశాల్లో చాలా ఇబ్బందులు, సమస్యలు ఉన్నాయి... భారత దేశాన్ని ప్రధాని సమర్థవంతంగా నడిపిస్తున్నారు. సూర్య ఘర్, పీఎం కుసుమ్ వంటి వాటిని కేంద్రం ప్రోత్సహిస్తోంది. అమెరికాలో నాలుగు పవర్ గ్రిడ్లు ఉన్నాయి... భారత దేశంలో ఒకే సెంట్రల్ పవర్ గ్రిడ్ ఉంది. భారత దేశంలో ఏ మారుమూల విద్యుత్ ఉత్పత్తి చేసినా... కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఎక్కడైనా వినియోగించుకునే అవకాశం ఉంది. ఈ పరిణామాలన్నీ 2014 తర్వాతే జరిగాయి. గతంలో సోలార్ విద్యుత్ యూనిట్‌కు ఉత్పత్తి వ్యయం రూ.14గా ఉండేది.. ఇప్పుడు యూనిట్‌కు రూ.2.40కు వ్యయం తగ్గింది. గతంలో సోలార్ ప్యానెళ్లను దిగుమతి చేసుకోవాల్సి వచ్చేది.. కానీ ప్రధాని మోదీ నిర్ణయాలతో ఇప్పుడు ఏపీలో సోలార్ ప్యానెళ్లు ఉత్పత్తి చేసుకుంటున్నాం.' అని అన్నారు.

# నిబంధనలు ఉల్లంఘించలేదు

వర్టికల్ రిజర్వేషన్ విధానాన్ని క్రమపద్ధతిలో అమలు చేశామని తెలిపారు. ఏ కేటగిరీకి ఆ కేటగిరీలోనే పోస్టులు ఇచ్చామని, మెరిట్‌లిస్ట్ ప్రకారమే నియామకాలు జరిగాయని చెప్పారు. వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి స్థిరమైన రోస్టర్ పాయింట్ లేదన్నారు. వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్ విధానం వల్లే విమర్శలు వస్తున్నాయని చెప్పారు. "జీవో 77పై అనేక విమర్శలు వచ్చాయి. డీఎస్సీపై ఇటీవల అన్ని వివరాలతో ప్రకటన కూడా ఇచ్చాం. డీఎస్సీలో ఎక్కడా నిబంధనలు ఉల్లంఘించలేదు. వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్ల గురించి అందరూ తెలుసుకోవాలి. గతంలో నోటిఫికేషన్ ఇచ్చినప్పుడే ఏ పోస్టు ఎవరికో చెప్పేవారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత కొన్ని మార్పులు వచ్చాయి. ఎంపికైనవారు సరిగానే సెలక్ట్ అయ్యారా? లేదా? అనేదే చూడాలి. హారిజాంటల్ రిజర్వేషన్ పద్ధతిపై సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. ఎవరికైనా అసంతృప్తి ఉంటే ఉద్యోగం ఎందుకు రాలేదో స్పష్టంగా తెలుసుకోవాలి. స్పోర్ట్స్, దివ్యాంగుల కోటాపై రోస్టర్ పాయింట్లు ఉంటాయి. స్పోర్ట్స్ కోటాలో గతంలో సెపరేట్ పాయింట్ ఉండేది.. ఇప్పుడు లేదు. ముందుగానే నోటిఫై చేసే పద్ధతి కూడా లేదు. ఎవరు ఏ కేటగిరీ నుంచి వచ్చారో అందులోనే పోస్టు భర్తీ చేస్తాం. కాల్ లెటర్ వచ్చినా సెలెక్ట్ కాకపోయేందుకు కారణాలు ఉంటాయి. వచ్చింది వెరిఫికేషన్ కాల్ లెటర్ మాత్రమే. ఎవరైనా రెండు, మూడు చోట్ల ఎంపికైనా ఒక్కచోటే తీసుకుంటారు. ఉద్యోగం ఇచ్చే విషయంలో ఒక్క తప్పు కూడా జరగలేదు" అని అధికారులు వివరించారు.

# ఎంతో తృప్తినిచ్చింది

స్థానికి ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ సారధ్యంలో జిల్లా కలెక్టర్ వారి చొరవతో తీసుకున్నచర్యలు మూలంగా 22ఎ భూముల మినహాయింపుకు సిసిఎల్ఎ ద్వారా ఉత్తర్వులు జారీచేయబడ్డాయన్నారు. అదే విధంగా జిల్లాలో ఇంకా 480 ఎకరాల వరకు ఉన్నాయని వాటిలో 216 ఎకరాలు ఎండోమెంట్ కు సంబంధించి ఉన్నట్లు గుర్తించామన్నారు. వీటి పరిష్కారానికి త్వరలో గ్రీవెన్స్ డే ఏర్పాటుచేసి దేవాదాయ శాఖ, కమీషనరు, డిప్యూటీ కమీషనరు తదితరుల సహకారంతో 22ఎ జాబితానుండి తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, డిప్యూటీ సిఎం వారి సారధ్యంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నామని ప్రతి నియోజకవర్గంలో జరుగుతున్న అపనులు, సంక్షేమ పథకాలు పురోగతిని డిఆర్ సిలో సమీక్షించుకోవడం జరిగిందన్నారు. ఖరీఫ్ కు ఏవిధంగా సమాయాత్తం అయ్యేది కార్యాచరణ రూపొందించుకోవడం జరిగిందన్నారు. ఎన్నడూ లేని విధంగా అద్భుతంగా కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి 24 గంటలలోపే రైతులకు సొమ్ములు చెల్లించడం జరిగిందన్నారు. నూకశాతం ఎక్కువగా వచ్చే వరి వంగడాలను సాగుచేయడం మానుకోవాలని మంత్రి సూచించారు. ఈ ధాన్యాన్ని ఎఫ్ సిఐ కొనుగోలు చేయడంలో ఇబ్బందులు ఏర్పడుతుందన్నారు. అయితే గత సీజన్ లో రైతులను దృష్టిలో ఉంచుకొని సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నులు మొదటిసారిగా కొనుగోలు చేయడం జరిగిందన్నారు. అందువలన పిఆర్ 126, ఎంటియు 1153, ఎంటియు 1001, ఎంటియు 1010, ఎంటియు 1156, ఎంటియు 1293, ఎంటియు 1275, ఎంటియు 1061, ఎంటియు 1064 వరి వంగడాల వలన నూకశాతం ఎక్కువగా వస్తాయని అందుమూలంగా రైతులను వీటికి బదులుగా వేరే వరి వంగడాలను వేసేలా అవగాహన పరచాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించామన్నారు. అదే విధంగా ఫైన్ వెరైటీ(సన్నబియ్యం) 75 వేల ఎకరాల్లో సాగుచేసేలా ప్రోత్సహించాలని సూచించడం జరిగిందన్నారు. జిల్లాలో ఉద్యాన పంటలను అభివృద్ధి చెందడం ద్వారా ప్రతి సంవత్సరం 15 శాతం వృద్ధిచెందేలా ప్రణాళిక సిద్దం చేశామన్నారు. ప్రతి నియోజకవర్గంలో రైతులకు అవగాహన పరచడం జరుగుతుందన్నారు. పామ్‌ఆయిల్,మిరియాల పంట, కోకో ప్రోసెసింగ్ సాగు సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో 157 ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకున్నామని, మరో 150 యూనిట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని మరింత విస్తృతం చేయాలన్నారు. మనజిల్లా రాష్ట్రంలో మొదటిస్థానంలో ఉన్నప్పటికీ మరిన్ని చర్యలు తీసుకొని ప్రభుత్వ కార్యాలయాలు, గృహావసరాలకు పిఎం సూర్యఘర్ పథకాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో 300 యూనిట్లు ఈ మాసంలో ఏర్పాటు చేయాలనే లక్ష్యంగా నిర్ణయించామన్నారు. జిల్లాలో ఆర్గానిక్ ఉత్పత్తులు ప్రోత్సహించే దిశగా 31 సరుకులను ఉత్పత్తిచేయడం జరుగుతున్నదని వాటికి మార్గెటింగ్ సౌకర్యం కల్పించేందుకు పైలెట్ ప్రాజెక్టుగా ఆర్ టిసి బస్టాండ్లలో స్టాల్స్ ఏర్పాటుకు ప్రోత్సహించేలా ముందుకు వెళ్లాలన్నారు. భూ గర్భజలాలకు సంబంధించి ఏలూరు జిల్లాలో ఇబ్బందికరమైన పరిస్థితులు ఉన్నాయని, 21 మీటర్లు లోతులోఉన్న భూగర్భ జలాలను కనీసం 16 మీటర్లకు తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. అన్నమయ్య జిల్లా భూగర్భజలాల పెంపులో పురోగతి సాధించిన దృష్ట్యా ఆ జిల్లాలో పరిస్థితులను పరిశీలించేందుకు ఒక బృందాన్ని పంపడం జరిగిందన్నారు. జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదైన ప్రాంతాల్లో భూ గర్భజలాలపెంపుకు ప్రణాళిక సిద్దం చేశామన్నారు. ఎన్ డిఏ ప్రభుత్వం రెండు సంవత్సరాలు పూర్తిచేసుకున్న నేపధ్యంలో జూన్ 9 నుండి 20 వరకు రాష్ట్ర వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు చేపట్టబోతున్నామన్నారు. గల్ఫ్ ప్రాంతంలో జరుగుతున్న యుద్ధం కారణంగా ఇటీవల వంటగ్యాస్ ఇబ్బందులు ఏర్పడ్డాయని, ప్రస్తుతం ఎటువంటి కొరతలేదని ఆయన స్పష్టం చేశారు. అయినప్పటికీ పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరాకు అవకాశం ఉన్న ఏలూరు, నూజివీడులో ఎల్ పిజి బదులు పిఎన్ జి గ్యాస్ కనెక్షన్లు అందించేందకు చర్యలు తీసుకున్నామన్నారు. ఏలూరు నగరంలో వెయ్యి కనెక్షన్లు, నూజివీడులో 2 వేలు కనెక్షన్లు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. దీపం పథకం కింద ఏవిధమైన రాయితీ కల్పిస్తున్నామో అదే విధంగా పిఎన్ జి గ్యాస్ కనెక్షన్లకు కూడా వెసులుబాటు కల్పిస్తామని చెప్పారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, రాజ్యసభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ, శాసన సభ్యులు బడేటి రాధాకృష్ణయ్య(చంటి), సొంగా రోషన్ కుమార్, పత్సమట్ల ధర్మరాజు, బొమ్మిడి నాయకర్, తదితరులు పాల్గొన్నారు.

# పేపర్ లీక్‌లు జరగలేదే?

మొదలయ్యాయని ఆక్షేపించారు. పరీక్షల్లో అవకతవకల నేపథ్యంలో గతంలో తెలంగాణలో బ్యాన్ చేసిన కోఎంప్ట్ ( గ్లోబరీనా) కంపెనీకే కేంద్రం సీబీఎస్ఈ 12వ తరగతి ఆన్-స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) విధానాన్ని కాంట్రాక్ట్ ఇచ్చిందని కేజ్రీవాల్ మండిపడ్డారు. ఆ కంపెనీ తెలంగాణలో సృష్టించిన సమస్యల వల్ల 20మందికి పైగా విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. అటువంటి కంపెనీకి ఇంత పెద్ద సీబీఎస్ఈ కాంట్రాక్ట్‌ను ఇవ్వడం వెనుక ఏదో కుట్ర ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ చర్య వల్ల దేశంలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరిగినా ఆ కంపెనీపై ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని కేంద్రాన్ని ప్రశ్నించారు. ఇటువంటి అక్రమాలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టాలని దేశ యువతకు కేజ్రీవాల్ పిలుపునిచ్చారు. పేపర్ లీక్‌లను అరికట్టడానికి నిర్ణయాత్మక చర్యలు తీసుకునేలా విద్యార్థులు, పౌరులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురానంత వరకు ఈ సమస్య కొనసాగుతూనే ఉంటుందన్నారు. రేపటి తరం భవిష్యత్తు కోసం ప్రజలు పెద్ద ఎత్తున వీధుల్లోకి రావాలని విజ్ఞప్తి చేశారు. నీట్, సీబీఎస్ఈ పేపర్ వివాదాలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# కాకినాడ రెవెన్యూ ఉద్యోగిపై ఏసీబీ దాడులు

విచారణ చేపట్టారు. రాజమహేంద్రవరంలోని ప్రత్యేక న్యాయస్థానం నుంచి సెర్చ్ వారెంట్లు పొందిన అధికారులు 5వ తేదీన నాలుగు ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు ప్రారంభించారు. కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటలోని వెర్దెంట్ ఎస్ఆర్ఎమ్‌టీ అపార్ట్‌మెంట్స్‌లో ఉన్న అధికారిక నివాసం, జిల్లా కలెక్టరేట్‌లోని రికార్డ్ రూమ్ కార్యాలయం, అలాగే కుటుంబ సభ్యుల నివాసాల్లో సోదాలు నిర్వహించారు. సోదాల్లో భారీ స్థాయిలో స్థిరాస్తులు, విలువైన వాహనాలు, బంగారు ఆభరణాలు, నగదు, ఎలక్ట్రానిక్ పరికరాలు వెలుగులోకి వచ్చినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. అతని పేరు మీద కాకినాడలో 1.24 కోట్ల విలువైన మూడు బెడ్‌రూమ్‌ల ఫ్లాట్, రామారావుపేటలో 1.20 కోట్ల విలువైన 375 గజాల ఖాళీ స్థలం ఉన్నట్లు గుర్తించారు. ఆయన భార్య పేరు మీద కాకినాడలో 1.77 కోట్ల విలువైన నాలుగు బెడ్‌రూమ్‌ల ఫ్లాట్, రంగంపేట మండలం కోటపాడులో వ్యవసాయ భూములు ఉన్నట్లు వెల్లడైంది. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో 3.4 కోట్ల విలువైన ఫ్లాట్‌ను కూడా అధికారులు గుర్తించారు. వాహనాల్లో టయోటా ఫార్చ్యూనర్, మహీంద్రా ఎలక్ట్రిక్ బీఈ6, మహీంద్రా థార్ రాక్స్ కార్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీటి మొత్తం విలువ సుమారు 98 లక్షలకు పైగా ఉంటుందని పేర్కొన్నారు. సోదాల్లో సుమారు 700 గ్రాముల బంగారు ఆభరణాలు, 20 వేల నగదు, 27 లక్షలకు పైగా విలువైన గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో ఖరీదైన మొబైల్ ఫోన్, ల్యాప్‌టాప్ కూడా ఉన్నాయి. ప్రస్తుతం సోదాలు కొనసాగుతున్నాయని, పూర్తి స్థాయి లెక్కలు అనంతరం అధికారిక వివరాలు వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు.

# లింగమనేని రమేష్ ఖరారు

ఆలోచనలకు ఆయన ఆకర్షితులయ్యారు. శనివారం మధ్యాహ్నం రమేశ్ నామినేషన్ వేస్తారు"అని హరిప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి ఖాళీ అయిన నాలుగు రాజ్యసభ స్థానాల్లో మూడు తెదేపా, ఒకటి జనసేన తీసుకోవాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే.

# వైకాపా మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అరెస్ట్

నకిలీ జీవోల తయారీ, ఆ ప్రతులను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం వెనుక ఈయన పాత్ర ఉన్నట్లు నిర్ధరించుకున్నారు. వీటికితోడు బ్రహ్మనాయుడి ఖాతా నుంచి రూ.1.25 కోట్ల నగదు బదిలీ అవడం దీనికి మరింత బలం చేకూర్చింది. ఇందుకు సంబంధించి పోలీసులు కీలక సమాచారాన్ని సేకరించారు. భూమిని కొట్టేసేందుకు కుట్ర పన్నిన కేసులో బ్రహ్మనాయుడు సహా మొత్తం 9 మందిపై కేసులు నమోదయ్యాయి. ఇటీవల సైబరాబాద్ పోలీసులు ఏపీలోని నరసరావుపేటలో బ్రహ్మనాయుడు నివాసంలో సోదాలకు వెళ్లగా అక్కడా ఆయన అందుబాటులో లేరు. ఇతర నిందితులు బొల్లా రమేశ్, కొవ్వూరు సునీల్, మరో ఇద్దరు కూడా పరారీలో ఉన్నారు. తొలుత హైదరాబాద్, ఆ తర్వాత కేరళ, తమిళనాడు, కర్ణాటకలోని వివిధ ప్రాంతాలకు నిందితులు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. శుక్రవారం కాంచీపురంలో బ్రహ్మనాయుడిని అరెస్ట్ చేశారు.

**పాలమూరు-రంగారెడ్డి పనులతో**

# కేసీఆర్ ఇంట్లో కనకవర్షం

రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "ఉమ్మడి జిల్లాలో జూరాల మినహా అన్ని ప్రాజెక్టులూ పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా జరగలేదు. పంపులు, లిఫ్ట్ పనుల్లో అవినీతిపై మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఏళ్ల తరబడి పోరాడారు. జిల్లా నలుమూలలా తిరిగి ప్రాజెక్టు పనులను కొలిక్కి తెచ్చే ప్రయత్నం చేస్తున్నా. మేం పనులు చేపడుతుంటే వాళ్లు రాజకీయ కార్యాచరణ చేపడుతున్నారు. సాగునీరు, తాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి క్షేత్రస్థాయి పర్యటన చేశా. పనులు పరిశీలించి భవిష్యత్‌లో ఎలాంటి చర్యలు చేపట్టాలనేదానిపై నిర్ణయం తీసుకుంటాం.

**అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారు**

కష్టకాలంలో పాలమూరు నుంచి కేసీఆర్‌ను ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధి చేస్తారని ఆశించాం. కృష్ణా జలాలు పూర్తిగా జిల్లాలో ప్రవహించినా ఎన్నడూ ఒడిసి పట్టుకోలేదు. కేసీఆర్ సీఎం అయ్యాక పాలమూరు ప్రాజెక్టులు పూర్తిచేస్తారనుకున్నాం. ప్రాజెక్టుల గురించి ప్రశ్నిస్తే అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారు. పాలమూరు-రంగారెడ్డి పూర్తయితే 26 లక్షల ఎకరాలకు ఆయకట్టు వచ్చేది. రూ.27వేల కోట్లు ఖర్చు చేసి పంపులు, లిఫ్ట్ పనులు పూర్తిచేశారు. ఈ పనులతో కేసీఆర్ ఇంట్లో కనకవర్షం కురిసింది. కమీషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదు. జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా జరగలేదు. కానీ.. ప్రాజెక్టులు పూర్తయినట్లు కేసీఆర్ ఎలా భావించారు?

**నాపై కోపంతో ఆ ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ తొక్కిపెట్టారు**

మేం అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టుల కోసం రూ.22వేల కోట్లు ఖర్చు చేశాం. వీటిలో రూ.8 వేల కోట్లు ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఇచ్చాం. ఈ జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి కావాలంటే 4వేల ఎకరాల భూసేకరణ చేయాలి. భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ చేయకుండా రిజర్వాయర్లలో నీళు నింపగలమా?రెండేళ్లలో పనులు పూర్తిచేయాలని కంకణం కట్టుకుని ముందుకెళ్తున్నాం. గతంలో విపరీతంగా అప్పులు తేవడం వల్ల ఇప్పుడు ప్రాజెక్టులకు అప్పులు తెచ్చుకోలేని పరిస్థితి వచ్చింది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.55వేల కోట్ల అంచనా వేసి రూ.27వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. 50 శాతం నిధులూ ఖర్చు పెట్టకుండా 90 శాతం పనులెలా పూర్తవుతాయి? ఉన్నదంతా దోచుకుని మమ్మల్ని దోషులుగా నిలబెడదామనే భ్రమల్లో ఉన్నారు. నాపై కోపంతో మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ తొక్కిపెట్టారు.

**బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలకు పైసా విలువ లేదు**

జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం. భూసేకరణకు రూపాయి ఎక్కువైనా ఇచ్చి సమస్యలు పరిష్కరిస్తాం. జిల్లాలో ప్రాజెక్టుల పూర్తికి సంపూర్ణంగా కట్టుబడి ఉన్నాను. తక్కువ భూసేకరణతో ఎక్కువ నీళ్లు నిల్వ చేసుకునే ప్రాజెక్టులను త్వరగా పూర్తిచేస్తాం. కర్ణాటకతో సమన్వయం చేసుకుని ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటాం. బ్రిడ్జ్ కమ్ బ్యారేజీల కోసం అధ్యయనం చేస్తున్నాం. పనులకు అడ్డుపడకుండా ఉండాలని బీఆర్ఎస్ నేతలను కోరుతున్నా. ఆ పార్టీ నేతల వ్యాఖ్యలకు పైసా విలువ లేదు. కేసీఆర్ రద్దయిన వెయ్యి రూపాయల లాంటివారు. బీఆర్ఎస్ పార్టీకి, నేతలకు గతమే ఉంది.. భవిష్యత్తు లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ప్రాజెక్టయినా మొదలుపెట్టి పూర్తి చేసిందా చెప్పాలి. ప్రాణహిత-చేవెళ్ల పేరు, ఊరు మార్చి దోపిడీ చేయడమే కేసీఆర్‌కు తెలుసు. ఆయన సొంతంగా మొదలుపెట్టిన ప్రాజెక్టు ఒక్కటీ రాష్ట్రంలో లేదు. కాళేశ్వరం కూలిన తర్వాత చుక్క నీళ్లు తీసుకోకుండా ఎక్కువ వరి ఉత్పత్తి చేశాం"అని రేవంత్ అన్నారు.

# ఎస్‌యూ-57ను కలిసి రూపొందిద్దాం..

అభివృద్ధి, ఉత్పత్తి చేయడానికి, అలాగే కీలక సాంకేతికతలను పంచుకోవడానికి రష్యా సుముఖంగా ఉందని వెల్లడించారు. సెయింట్‌పీటర్స్‌బర్గ్‌లో అంతర్జాతీయ వార్తాసంస్థల అధినేతలతో మాట్లాడిన సందర్భంగా అధ్యక్షుడు ఈ ప్రతిపాదన చేశారు. భారత వైమానిక దళంలో ఐదో తరం యుద్ధ విమానాలు లేవు. మరోవైపు, పాకిస్థాన్ త్వరలో చైనాకు చెందిన షెన్‌యాంగ్ జె-35ఏ రకానికి చెందిన స్టెల్త్ ఫైటర్స్‌ను సొంతం చేసుకోనుందని వార్తలు వస్తోన్న వేళ రష్యా నుంచి స్పందన రావడం గమనార్హం. రక్షణరంగంలో తమ రెండు దేశాల మధ్య ఎలాంటి పరిమితులు ఉండవని చెప్పిన పుతిన్.. పరోక్షంగా పాశ్చాత్య దేశాలకు చురకలు అంటించారు. ఆ దేశాలు సాంకేతికతను బదిలీ చేసేందుకు పలు ఆంక్షలు విధిస్తుంటాయని గుర్తుచేశారు. అయితే ఎస్‌యూ-57 ఫైటర్ జెట్‌ను సంయుక్తంగా అభివృద్ధి చేసేందుకు రష్యా గతంలోనే భారత్‌కు అవకాశం ఇచ్చింది. 2018లోనే ఆ చర్చలు జరిగాయని ఆయన గుర్తుచేశారు. అయితే భారత్ అప్పుడు ఆ ప్రాజెక్ట్ నుంచి వైదొలగింది. ఆ యుద్ధ విమానంతో పూర్తిస్థాయి కార్యాచరణ అవసరాలు తీరవని ఐఏఎఫ్ నిర్ధరించడంతో భారత్ వెనక్కి తగ్గింది. ఇదిలాఉంటే.. స్వదేశీ పరిజ్ఞానంతో ఐదోతరం జెట్‌ను తయారు చేసేందుకు భారత్ చేపట్టిన 'అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్' (ఆమ్కా) ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉంది. 2030 మధ్యలో వైమానిక దళంలో చేరొచ్చని తెలుస్తోంది.

**భారత్-చైనా సంబంధాల్లో జోక్యం ఉండదు: పుతిన్**

భారత్-చైనా సంబంధాల్లో తమ జోక్యం ఉండబోదని పుతిన్ స్పష్టం చేశారు. అలాగే ఆ రెండింటి మధ్య ఉన్న సరిహద్దు వివాదాన్ని ఇరు దేశాలూ సామరస్యంగా పరిష్కరించుకుంటాయనే విశ్వాసాన్ని వ్యక్తంచేశారు. ఇక 2030లో తాను మరోసారి ఎన్నికల్లో పోటీ చేసే అంశంపై ఇప్పుడు మాట్లాడటం తొందరపాటే అవుతుందన్నారు. అప్పటికి తన ఆరోగ్యం ఎలా ఉంటుందో దేవుడికే తెలుసన్నారు. ప్రస్తుతం పరిష్కరించాల్సిన ఎన్నో అంశాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు.

# చేతులు కలపమన్నారు : అన్నామలై

సూపర్‌స్టార్ అడిగారన్నారు. "2024లో నేను భాజపాలో చేరడానికి ఒకరోజు ముందు రజనీకాంత్ నాకు ఫోన్ చేశారు. ఆయన నేతృత్వం వహిస్తున్న రాజకీయ ఉద్యమంలోకి రావాలని ఆహ్వానించారు. కానీ, నేను అప్పటికే భాజపా సీనియర్ నేత బీఎల్ సంతోష్‌కు మాటిచ్చా. అందుకే రజనీ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించా. నేను రాజకీయాల్లోకి రావడానికి కారణం బీఎల్ సంతోష్ ఇచ్చిన హామీనే. నా రాజకీయ ప్రవేశంపై ఉన్న ఊహాగానాలకు ముగింపు పలికేందుకు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాను. అయితే తమిళనాడు విషయంలో నా అభిప్రాయాలు.. భాజపా నాయకత్వం అభిప్రాయాలతో సరిపోలలేదు. ఈ విభేదాలను పరిష్కరించుకునేందుకు పార్టీ అగ్రనాయకత్వంతో 18 నెలలుగా ఎన్నో చర్చలు జరిపాను. ఇంక భాజపాకు భారంగా ఉండకూడదని అనుకున్నాను" అని అన్నామలై వివరించారు. ఇకపై స్వతంత్ర రాజకీయ మార్గంలో ముందుకువెళ్తానని, తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త బాటలు వేసేందుకు పోరాడతానని తెలిపారు. గత ఏడాది డిసెంబర్‌లోనే నా రాజీనామా గురించి చెప్పాను. అయితే పార్టీ పెద్దలు నన్ను ఆపారు. ఎన్నికల బాధ్యతలు నిర్వహించమని సూచించారు. ఇప్పుడు నా రాజకీయాలు సామాన్యుడి లక్ష్యంగా ఉంటాయి. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సొంతంగా పోటీ చేస్తాను. అప్పటివరకు అందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తాను. ప్రధాని మోదీపై నాకు అపారగౌరవం ఉంది. భాజపా ఇప్పటివరకు నాపై ఉంచిన నమ్మకానికి, ఇచ్చిన అవకాశాలకు కృతజ్ఞతలు" అని అన్నామలై వెల్లడించారు. అలాగే అన్నామలై మక్కల్ ఇయక్కమ్ పేరిట రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించారు. దానికి భారీ స్పందన వస్తోందని చెప్పారు.

**పార్టీకి నష్టం లేదు: భాజపా**

అన్నామలై వెళ్లిపోవడం వల్ల పార్టీకి ఎలాంటి నష్టం లేదని భాజపా తమిళనాడు చీఫ్ నైనార్ నాగేంద్రన్ అన్నారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే చర్యలు కొనసాగుతాయని తెలిపారు.

# ఎడిటర్ వాయిస్

## బీజేపీ కోటా లేనట్టే.. జనసేనకు లక్కీ ఛాన్స్!

ఏపీలో టీడీపీ కూటమి తాజాగా సమావేశం అయి రాష్ట్రం నుంచి ఖాళీ అవుతున్న నాలుగు రాజ్య సభ సీట్లను ఏ విధంగా సర్దుబాటు చేసుకోవాలన్నది సమీక్షించింది. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో జరిగిన ఈ భేటీలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఏపీ టీడీపీ ప్రెసిడెంట్ పల్లా శ్రీనివాస్. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాదెండ్ల మనోహర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో ఏపీ నుంచి ఖాళీ అయ్యే నాలుగింటిలో మూడు తెలుగుదేశం పార్టీ ఒకటి జనసేన పంచుకోవడానికి నిర్ణయించారు అని తెలుస్తోంది. బీజేపీకి ఈ దఫా చాన్స్ లేనట్లే అని చెబుతున్నారు.

**బీజేపీ వాటా పూర్తి :** ఇక ఏపీలో ఏ పదవులు అయినా దామాషా పద్ధతిలో పంచుకుంటున్నారు. కూటమిలో పెద్దన్న అయిన టీడీపీ సింహ భాగం తీసుకుంటే తరువాత ప్లేస్ లో జనసేన ఉంటోంది. బీజేపీకి మూడవ అవకాశం దక్కుతోంది. అయితే రాజ్యసభ సీట్ల విషయం తీసుకుంటే 2024 నుంచి 2029 మధ్యలో పన్నెండు దాకా ఖాళీ అయితే అందులో బీజేపీ వాటాగా ఇప్పటికే రెండు సీట్లు ఇచ్చేశారు. ఆ విధంగా ఆర్ క్రిష్ణయ్య, గోదావరి జిల్లాల నుంచి ఒక నేత ఎన్నికయ్యారు. ఇదే సమయంలో టీడీపీ గతంలో రెండు తీసుకుంది. ఇపుడు మూడు తీసుకుంటోంది. ఇప్పటిదాకా ఒక్క చాన్స్ కూడా దక్కని జనసేనకు తొలిసారి ఒక సీటు ఇస్తున్నారు. రానున్న కాలంలో ఇదే ఫార్ములా ప్రకారం సీట్లను కేటాయిస్తారు అని అంటున్నారు. ఈ లెక్కన జనసేనకు రాజ్యసభ సీట్లు వస్తాయని బీజేపీ వాటా కోటా పూర్తి అయినట్లే అని అంటున్నారు.

**జనసేనకు మరో రెండు సీట్లు :** మొత్తంగా 2029 ఎన్నికల ముందు దాకా జరిగే రాజ్య సభ ఎన్నికల్లో లభించే సీట్లలో మరో రెండు జనసేనకు దక్కుతాయని అంటున్నారు. ఆ మిగిలిన సీట్లు టీడీపీకి వస్తాయని అంటున్నారు. అంటే ఈ టెర్మ్ లో బీజేపీకి రాజ్యసభ సీట్లు ఏపీ నుంచి దక్కేది ఉండదని తెలుస్తోంది. 2028లో చూస్తే మరో నాలుగు సీట్లు ఖాళీ అవుతాయని అంటున్నారు. ఆ సీట్ల విషయంలోనూ జనసేన టీడీపీలకే షేరింగ్ ఉంటుందని అంటున్నారు.

**ఆశావహులు డీలా :** ఇక ఏపీ నుంచి బీజేపీ తరపున రాజ్యసభ కోటాలో పెద్దల సభకు వెళ్లాలని అనుకుంటున్న వారికి నిరాశ కలిగినట్లే అంటున్నారు. అందులో మాజీ ముఖ్యమంత్రి ఒకరితో పాటు కీలక నేతలు ఉన్నారని చెబుతున్నారు. ఇక తమిళనాడు నుంచి అన్నామలైకి ఏపీ కోటాలో సీటు దక్కుతుందని ప్రచారం సాగినా అది కూడా ఉత్తిదే అని తేలిపోయింది. బీజేపీ సైతం ఏపీ విషయంలో పెద్దగా ఒత్తిడి చేయదలచుకోలేదని అంటున్నారు. దాంతో టీడీపీ నుంచి ఈసారి ముగ్గురు రాజ్యసభకు నామినేట్ అవుతారని



అంటున్నారు జనసేన అభ్యర్థి ఎవరో తేలాల్సి ఉంది. ఈ నెల 8న రాజ్యసభకు నామినేషన్లు దాఖలు చేసేందుకు గడువు పూర్తి అవుతుంది. ఏపీ నుంచి నలుగురు మాత్రమే పోటీ పడితే వారంతా ఏకగ్రీవంగా నెగ్గినట్లుగా ఈ నెల 11న ప్రకటిస్తారు.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## 20 సార్లు కత్తితో పొడిచి.. మాజీ ప్రియురాలిని హత్య చేసిన ప్రేమోన్మాది

**విశ్వం వాయిస్ న్యూస్ :** పంజాబ్‌లో ఘోరం చోటుచేసుకుంది. ఆఫీసులో అందరూ చూస్తుండగానే.. తన మాజీ ప్రియురాలిని ఓ ప్రేమోన్మాది అతి దారుణంగా పొడిచి చంపేశాడు. ఆ తర్వాత అతడు కూడా ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటియాలాకు చెందిన డింపుల్ (30) మోహాలీలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తుంది. అదే కంపెనీలో సహోద్యోగిగా ఉన్న హర్జిందర్ సింగ్ (39)తో మూడేళ్లుగా ప్రేమలో ఉంది. అయితే ఇటీవలే వీరు విడిపోయినట్లు తెలుస్తోంది. దీన్ని తట్టుకోలేకపోయిన హర్జిందర్ సింగ్.. డింపుల్‌తో మళ్లీ కలిసేందుకు అనేకసార్లు ప్రయత్నించాడు. అందుకు ఆమె నిరాకరించడంతో మానసిక వేదనకు గురయ్యాడు. గురువారం సాయంత్రం ఆవేశంగా కంపెనీ లోపలికి వచ్చిన హర్జిందర్ సింగ్ కత్తితో ఆమెపై దాడి చేశాడు. ఆమె తప్పించుకునేందుకు ప్రయత్నించినప్పటికీ.. వెంబడించి దాదాపు 20 సార్లు కత్తితో పొడిచి హతమార్చాడు. తోటి ఉద్యోగులు అతడిని ఆపేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. ఆ తర్వాత నిందితుడు కూడా తనని తాను కత్తితో పొడుచుకొని ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటనకు సంబంధించిన భయంకరమైన దృశ్యాలు అక్కడి సీసీటీవీలో రికార్డయ్యాయి. ఈ ఘటనతో కార్యాలయంలోని ఉద్యోగులు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం పోలీసులు అక్కడికి చేరుకొని ఇరువురినీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే డింపుల్ చనిపోగా.. హర్జిందర్ సింగ్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## అనుమానాస్పద స్థితిలో.. ఢిల్లీ యూనివర్సిటీ మహిళా ప్రొఫెసర్ మృతి

**విశ్వం వాయిస్ న్యూస్ :** ఢిల్లీ యూనివర్సిటీ మహిళా ప్రొఫెసర్ దేవోస్మిత పాల్ అనుమానాస్పద స్థితిలో మరణించారు. వసుంధర ఎన్‌క్లేవ్‌లోని తన ఫ్లాట్‌లో విగతజీవిగా పడి ఉన్నారు. పోలీసులు దీన్ని హత్యగా అనుమానిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవోస్మిత పాల్ శివాజీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆమె భర్త బెంగళూరులో ఉంటుండగా.. ఇక్కడి సత్యం అపార్ట్‌మెంట్స్‌లోని ఫ్లాట్‌లో ఆమె ఒంటరిగా ఉంటున్నారు. ఉదయం నుంచి ఫ్లాట్ బయట తాళం వేసి ఉండటం, ఫోన్ చేసినప్పటికీ.. స్పందించకపోవడంతో మృతురాలి సోదరి దేవరితికి అనుమానం వచ్చింది. ఫ్లాట్ తాళం పగలకొట్టి లోపలికి వెళ్లి చూడగా.. ఆమె విగతజీవిగా కన్పించింది. దీంతో ఆమె పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. తలపై బలమైన వస్తువుతో దాడి చేయడం వల్లే ఆమె మరణించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఫోరెన్సిక్ నిపుణులు ఆధారాలు సేకరించి పరిశీలిస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ఎల్‌బీఎస్ ఆస్పత్రికి తరలించారు. ఇంట్లోని బంగారం, నగదు అలాగే ఉన్నాయని.. దోపిడీ జరిగిన ఆనవాళ్లు లేవని పోలీసులు తెలిపారు. దీనిని హత్యగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

## ఉద్యోగాల పేరుతో రూ.7 కోట్ల మోసం



ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు

**నంద్యాల, విశ్వం వాయిస్ న్యూస్ :** మెడికల్ బిల్లింగ్ కంపెనీలో ఉద్యోగాల పేరుతో సుమారు రూ.7 కోట్లు వసూలు చేసి, మోసగించిన ఘటన గురువారం నంద్యాల పట్టణంలో వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాలలోని పద్మావతి నగర్‌లో మెడికల్ బిల్లింగ్ సంస్థను నిర్వహిస్తున్నట్టు ఇమ్రాన్, వెంకట మధుసాయి, విఘ్నేష్‌లు ప్రచారం చేసుకున్నారు. ఇంట్లోనే ఉద్యోగం చేసుకొనే అవకాశం కల్పిస్తామని, శిక్షణ సమయంలోనూ వేతనం ఇస్తామంటూ గతేడాది నుంచి చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో అనంతపురం, వైఎస్సార్ కడప, నంద్యాల జిల్లాలతోపాటు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలకు చెందిన సుమారు 700 మందిని చేర్చుకున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేశారు. కొత్తలో 3 నెలలు వర్క్ ఫ్రమ్ హోమ్ పేరుతో ఆన్‌లైన్‌లో శిక్షణ ఇచ్చి, జీతాలూ ఇచ్చారు. ఆ తర్వాత నుంచి వేతనాలు ఇవ్వడం ఆపేశారు. ఉద్యోగాలూ ఇవ్వలేదు. దీంతో బాధితులు మోసపోయినట్లు గ్రహించారు. తమకు న్యాయం చేయాలంటూ త్రివేది, అనిల్‌కుమార్ తదితరులు నంద్యాల ఎస్పీని కలిశారు.

## రూ.2 లక్షలు ఇస్తేనే సొంత కలప రవాణాకు అనుమతి

### రూ.80 వేలు తీసుకుంటూ అనిశాకు చిక్కిన అటవీ రేంజి అధికారి



**మల్యాల, విశ్వం వాయిస్ న్యూస్ :** సొంత కలప రవాణాకు అనుమతిచ్చేందుకు ఓ రైతు నుంచి రూ.80 వేలు లంచం తీసుకుంటూ జగిత్యాల జిల్లా కొడిమ్యాల అటవీశాఖ రేంజి అధికారి గులాం మొయినుద్దీన్ గురువారం అవినీతి నిరోధక శాఖ(అనిశా) అధికారులకు చిక్కారు. అనిశా ఇన్‌స్పెక్టర్ తిరుపతి కథనం ప్రకారం... కొడిమ్యాల మండలం హిమ్మత్‌రావుపేటకు చెందిన రంజిత్ తన సొంత భూమిలో సాగు చేసిన 120 టేకు చెట్ల కలపను తరలించేందుకు అనుమతి కోసం ఎఫ్‌ఆర్‌వో గులాం మొయినుద్దీన్‌ను సంప్రదించారు. ఇందుకు ఆయన రూ.2 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గత నెల 13న బాధితుడు రూ.లక్ష అందజేశారు. మిగితా డబ్బులివ్వాలని ఒత్తిడి చేస్తుండటంతో రంజిత్ అనిశా అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ సూచన మేరకు బాధితుడు మొయినుద్దీన్‌కు రూ.80 వేలు అందజేస్తుండగా అధికారులు పట్టుకున్నారు. అనంతరం అధికారిని కరీంనగర్ అనిశా కోర్టులో హాజరుపర్చగా రిమాండు విధించారు.

## అర్ధరాత్రి ఫోన్ మాట్లాడటం చూసి.. భార్యను చంపిన భర్త

**గురుగ్రామ్, విశ్వం వాయిస్ న్యూస్ :** హరియాణాలోని గురుగ్రామ్‌లో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. అర్ధరాత్రి వేళ భార్య ఫోన్‌లో మాట్లాడటం చూసిన భర్త.. ఆ ఫోన్‌ను తనకు ఇవ్వడానికి నిరాకరించడం, ఆపై అనుమానంతో ఆమెను హత్య చేశాడు. స్కార్ఫ్‌తో గొంతు నులిమి చంపేసి అక్కడి నుంచి పరారై.. చివరకు పోలీసులకు చిక్కాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరేంద్ర సింగ్ (37), కాజల్ దేవి (36) దంపతులకు నలుగురు పిల్లలు. వీరిద్దరూ ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. భార్య రోజూ 8గంటలకే ఇంటికి వచ్చేయగా.. నిందితుడు మాత్రం అర్ధరాత్రి వేళ వస్తుంటాడు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి ఆమె ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడటం చూసి ఆగ్రహించాడు. ఆ ఫోన్ తనకు ఇవ్వాలని అడగ్గా.. అందుకు నిరాకరించింది. దీంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. తీవ్ర ఆగ్రహం, అనుమానంతో రగిలిపోయి కాజల్‌ను స్కార్ఫ్‌తో గొంతునులిమి చంపి అక్కడి నుంచి పరారయ్యాడు. ఆ సమయంలో నలుగురు పిల్లలు ఇంటి మేడపై నిద్రపోతున్నారని పోలీసులు వివరించారు. మృతురాలి సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడిది ఉత్తర్‌ప్రదేశ్‌లోని మథుర జిల్లాగా గుర్తించారు. భార్యను చంపేందుకు నరేంద్రసింగ్ ఉపయోగించిన స్కార్ఫ్‌ను స్వాధీనం చేసుకొని అతడిని విచారిస్తున్నట్లు తెలిపారు.

## ఏసీబీ దాడులు.. కలెక్టరేట్ ఉద్యోగికి కళ్లు చెదిరే ఆస్తులు

**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆయన చేస్తున్న ఉద్యోగం కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్.. వయసు 36 ఏళ్లు.. ఆస్తులు చూస్తే కళ్లు చెదిరిపోతాయి. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో కాకినాడకు చెందిన చోడపురెడ్డి శివకుమార్ ఇంట అవినీతి నిరోధకశాఖ అధికారులు శుక్రవారం తనిఖీలు చేశారు. రూ.కోట్లాది స్థిర, చరాస్తులను కూడబెట్టినట్లు గుర్తించారు. కాకినాడలోని శివకుమార్, మామ చింతల శ్రీనివాసన్ ఇళ్లతో పాటు కలెక్టరేట్, చీడిగలోని అతని సోదరి నాగిశ సుష్మ ఫ్లాట్‌లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. శివకుమార్ దంపతుల పేరిట కాకినాడ, తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాలో విలాసవంతమైన ఫ్లాట్లు, ఖరీదైన కార్లు, భారీగా బంగారం, వ్యవసాయ భూములున్నట్లు గుర్తించారు. ఇప్పటివరకు వారి పేరున రూ.8 కోట్లకు పైగా ఆస్తులున్నట్లు తేల్చారు. సోదాలు ఇంకా కొనసాగుతున్నాయని అనిశా అధికారులు పేర్కొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌తో అప్పులపాలు..

## బ్యాంకులో చోరీకి యత్నించిన బ్యాంకు ఉద్యోగి

### మేనేజర్, క్యాషియర్‌లపై సుత్తితో దాడి



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆన్‌లైన్ బెట్టింగ్‌లో డబ్బు పోగొట్టుకున్న ఓ బ్యాంకు ఉద్యోగి.. అప్పులు తీర్చడానికి బ్యాంకులోనే చోరీకి యత్నించి అడ్డంగా దొరికిపోయాడు. ఈ ఘటన విశాఖలోని కంచరపాలెం ఐటీఐ కూడలిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలోని సీతంపేటకు చెందిన ఎల్లా రవికుమార్ అనకాపల్లి జిల్లా ఎలమంచిలిలోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచిలో ఆపరేషన్స్ విభాగంలో పనిచేస్తున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతూ రూ.65 లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. వాటిని తీర్చడానికి ఐటీఐ కూడలి వద్ద ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచిలో చోరీచేయాలని పన్నాగం పన్ని, రెక్కీ చేశాడు. తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలు ఎక్కువగా బ్యాంక్‌కు వచ్చినట్లు తెలుసుకున్నాడు. బుధవారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేటప్పుడు ఐటీఐ కూడలి బ్రాంచి వద్ద ఆగాడు. ఆ సమయంలో మేనేజర్ శివరామరాజు, క్యాషియర్ రమేష్ లావాదేవీలు చూస్తున్నారు. సహచర ఉద్యోగి వచ్చాడని రవికుమార్‌ను లోపలికి అనుమతించారు. రవికుమార్ బంగారు ఆభరణాలు భద్రపరిచే గది వైపు వెళుతుండగా మేనేజర్ అడ్డుకున్నారు. దీంతో ఆయనతో వాగ్వాదానికి దిగి, సుత్తితో మేనేజర్ శివరామరాజుపై దాడి చేశాడు. అడ్డుకోబోయిన క్యాషియర్ రమేష్‌పైనా దాడిచేశాడు. బాధితులు కేకలు వేయడంతో బయటకు పారిపోయిన నిందితుడిని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనలో మేనేజర్, క్యాషియర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కంచరపాలెం పోలీసులు రవికుమార్‌ను అరెస్ట్ చేశారు.




## అంతా ప్లాస్టిక్కే..




ఫ్రెండ్స్.. ఇప్పుడు మీకో టాస్క్. ఒకసారి మీ స్కూలు బ్యాగ్‌లో ఎన్ని ప్లాస్టిక్ ఐటమ్స్ ఉన్నాయో లెక్క పెట్టండి. లెక్క చూశాక అమ్మో అనిపిస్తుంది కదూ. ఇంట్లో ఉన్న వస్తువుల్ని కూడా లెక్కిస్తే కళ్లు తేలేయాల్సిందే. మనం వాడే పెన్ను మొదలు లంచ్‌బాక్సుదాకా అంతా ప్లాస్టిక్కే. అవును, మనకు తెలియకుండానే రోజూ బోలెడన్ని ప్లాస్టిక్ వస్తువులు వాడేస్తున్నాం. మన రోజువారీ జీవితంలో ప్లాస్టిక్ ఒక భాగంగా మారిపోయింది. మరి దాని గురించి తెలుసుకుందామా! మనం స్కూలులో క్లే వాడతాం కదా! దాంతో రకరకాల ఆకృతులు తయారు చేస్తాం. ప్లాస్టిక్ కూడా ఎలా కావాలంటే అలా తీర్చిదిద్దుకోవడానికి వీలుగా ఉండే పదార్థం. ప్లాస్టిక్‌ను వేడి చేసి, అది చల్లారే లోపు కావాల్సిన ఆకృతిలోకి మార్చుకోవచ్చు. ప్లాస్టిక్ కోసం శాస్త్రవేత్తలు చాలా రకాలుగా ప్రయత్నించారు. కాలక్రమంలో రకరకాల ప్లాస్టిక్ పదార్థాలను గుర్తించారు. అప్పట్లో సహజసిద్ధ పదార్థాలైన కర్ర, మెటల్, తోలు వంటివి ఎక్కువగా లభించేవి. ఇలాంటి సింథటిక్ మెటీరియల్‌తో పెద్దగా ఉపయోగం కనిపించ లేదు. 1907లో లియో బేక్‌లాండ్ ఫెనోలిక్ ప్లాస్టిక్‌ను కనిపెట్టారు. భారీ పరిమాణాల్లో తయారు చేయడానికి వీలయ్యే పూర్తిస్థాయి సింథటిక్ మెటీరియల్ అదే. అప్పట్నుంచి పలువురు శాస్త్రవేత్తలు విభిన్న రకాల ప్లాస్టిక్‌లను కనిపెట్టారు. ఇప్పుడు దాదాపు 50కిపైగా రకాల ప్లాస్టిక్కులున్నాయి. ప్లాస్టిక్స్ తయారీలో క్రూడ్‌ఆయిల్ కీలక ముడి సరకు. కాకపోతే ఇది శిలాజ ఇంధనం. అంటే మన భూగోళంపై పరిమితంగా ఉన్న ఒక వనరు. ప్లాస్టిక్‌తో గత వందేళ్లలో ప్రపంచమే మారిపోయింది. ఎలాంటి రూపంలోకైనా మారగలగడం, దృఢంగా ఉండటం, తయారీ సులభం, చవక కావడం వంటి కారణాలతో ప్లాస్టిక్ వాడకం పెరిగింది. కాకపోతే, పర్యావరణానికి అది చేస్తున్న హానితోనే పెద్ద సమస్య. అందుకని, వాడేసిన ప్లాస్టిక్‌ను ఎక్కడ పడితే అక్కడ పారేయొద్దు, జాగ్రత్తగా ఉండాలి.

## టెక్ మేధావి.. మూడేళ్లకే కోడింగ్..

### ఆరేళ్లకే బెస్ట్ స్పీకర్‌గా రికార్డు

హలో ఫ్రెండ్స్..! ఈమధ్య ఏఐ గురించి మనం తరచూ ఏదో ఒకటి వింటూనే ఉన్నాం కదా! దానికి సంబంధించి జరిగిన ఓ కార్యక్రమంలో మనలాంటి ఓ నేస్తం.. ఏఐ అభివృద్ధి గురించి చాలా బాగా వివరించాడు. ఇంతకీ తనెవరంటే..ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన రణ్‌వీర్ సచ్‌దేవాకు ఎనిమిదేళ్లు. తనది మూడో తరగతి చదివే వయసే అయినా ఎంతో అనుభవమున్న కోడర్లు కూడా వివరించలేని విషయాలు అలవోకగా చెప్పేస్తున్నాడు. ఇటీవల దిల్లీలో జరిగిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్-2026లో ఏఐ అభివృద్ధినీ అలాగే భారత తత్వశాస్త్రాన్ని పోలుస్తూ దేవా మాట్లాడిన విధానం అక్కడున్న పెద్దవాళ్లందరినీ ఆకర్షించింది. ఆ సమిట్‌లో ప్రసంగించిన అతి చిన్న వయసు వ్యక్తి కూడా మన దేవానే! అంతేకాకుండా తను ఏఐకి సంబంధించిన కొన్ని విషయాలు మనలాంటి పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా 'ఆర్ యూ బోర్న్ విత్ ఏఐ' అనే పుస్తకాన్ని రాశాడు. మూడేళ్ల వయసులోనే అమ్మానాన్నల సాయంతో కోడింగ్ నేర్చుకోవడం ప్రారంభించాడు తను. అయిదేళ్లకు కోడింగ్ వన్ ఆన్ వన్ సెషన్‌లో పాల్గొని.. ఆపిల్ సంస్థ సీఈవో టిమ్ కుక్ నుంచే ఆహ్వానం అందుకున్నాడు. 2022లో ఒక గ్లోబల్ రీడింగ్ ఛాలెంజ్‌లో పాల్గొని 'సూపర్ ప్రెజెంటర్'గా నిలిచి బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఆరేళ్ల వయసులో టెక్నాలజీ, ఆవిష్కరణల గురించి టెడ్ఎక్స్ వేదిక మీద మాట్లాడి 'యంగెస్ట్ టెడ్ఎక్స్ స్పీకర్'గానూ



నిలిచాడు. అలాగే బెస్ట్ స్పీకర్‌గా 'ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించుకున్నాడు దేవా. మరో విషయం ఏంటంటే.. మార్స్ మీద అన్వేషణ కోసం ఒక నమూనా రాకెట్‌షిప్‌ను తయారు చేసి, దానికి నాసాకు సంబంధించిన జెట్ ప్రొపల్షన్ ల్యాబొరేటరీ నుంచి గుర్తింపు కూడా సాధించాడు. ప్రస్తుతం కొన్ని సంస్థలకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నాడు దేవా. మరి మనమూ నచ్చిన అంశంలో పట్టు సాధించేలా కష్టపడదామా!




# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

శనివారం, 06 జూన్, 2026




www.viswamvoice.com

# పర్యావరణ పరిరక్షణకు సైకిల్ తొక్కండి

## చంద్రబాబు పిలుపు మేరకు అమలాపురంలో ఎమ్మెల్యే ఆనందరావు ఆధ్వర్యంలో భారీ సైకిల్ ర్యాలీ



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు అమలాపురంలో శుక్రవారం భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పెరుగుతున్న పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఇంధన వినియోగాన్ని తగ్గించి, కాలుష్య రహిత రవాణాను ప్రోత్సహించేందుకు మోటార్ వాహనాలకు బదులుగా సైకిళ్ళు, ఈ-సైకిళ్లను వినియోగించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు సూచించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా అమలాపురంలో సైకిల్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. స్థానిక మెట్ల రమణబాబు నివాసం వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా ప్రయాణించిన సైకిల్ ర్యాలీ గడియార స్తంభం సెంటర్ వరకు కొనసాగింది. ర్యాలీ సందర్భంగా కార్యకర్తలు, నాయకులు పర్యావరణ పరిరక్షణకు మద్దతుగా నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. పెరుగుతున్న కాలుష్యం కారణంగా వాతావరణ మార్పులు తీవ్రమవుతున్న నేపథ్యంలో భూమిని, భావితరాలను కాపాడుకోవాల్సిన అవసరం మరింత పెరిగిందన్నారు. సైకిల్ వినియోగం ద్వారా ఇంధన పొదుపుతో పాటు ఆరోగ్య రక్షణ కూడా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమ దైనందిన జీవితంలో చిన్న చిన్న మార్పులు చేసుకుంటే పర్యావరణ పరిరక్షణలో గొప్ప ఫలితాలు సాధించవచ్చన్నారు. ముఖ్యంగా సమీప ప్రాంతాలకు వెళ్లేటప్పుడు సైకిళ్లను ఉపయోగించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. పర్యావరణానికి హాని కలిగించే కాలుష్యాన్ని తగ్గించడంలో సైకిల్ వినియోగం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అమూడ చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ చంద్రమౌళి, పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సైకిళ్లతో ర్యాలీలో పాల్గొన్న వారు పర్యావరణ పరిరక్షణకు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ సైకిల్ ర్యాలీ పట్టణ ప్రజలను ఆకట్టుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై చైతన్యం కల్పించడంలో విశేషంగా దోహదపడింది. కాలుష్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాయకులు పిలుపునిచ్చారు.

# కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై వైఎస్సార్‌సీపీ కదనం

## గంగవరంలో మిన్నంటిన నిరసన



**కే..గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు కదం తొక్కాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన మేనిఫెస్టో హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసగించిన తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ కే.గంగవరం మండలం, గంగవరం గ్రామంలో పెట్ట శ్రీనివాస్ ఆధ్వర్యంలో "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" పేరిట నిరసన కార్యక్రమం వాడవాడలా జరిగింది. ఈ ఆందోళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రామచంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ మాట్లాడుతూ పాలకుల తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని కేవలం మాయమాటలతో ప్రజలను నమ్మించి మోసగించిందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం తక్షణమే మేల్కొని ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ తమ నిరసన గళాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, పంపన సత్యానందం, బత్తుల అప్పారావు, చిల్లి నాగేశ్వరరావు, దారా సత్యనారాయణ, చిట్టూరి భద్రం, తోకల శ్రీను, పట్టా రాజేష్, కాదా గోవిందు, మేడిశెట్టి గోవిందు, పిల్లి రాంబాబు, మల్లిడి వెంకట్రావు, మేడిశెట్టి సుబ్రహ్మణ్యం, రెడ్డి జయరాజు, జంగం సత్తిబాబు, వాసంశెట్టి సూరిబాబు, విత్తనాల వాణి, యేసు రాజు, మల్లిడి వెంకట్రావు, మేడిశెట్టి శ్రీనివాసు, వల్లభ రెడ్డి చిన్ని, దంగేరు శ్రీను, గుత్తుల శ్రీను, వాసంశెట్టి శ్రీనులతో పాటు పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రకృతి పరిరక్షణే లక్ష్యంగా 'అమ్మ పేరున ఒక మొక్క'

## రామచంద్రపురం మండలంలో ఉత్సాహంగా పర్యావరణ దినోత్సవం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలంలో 'అమ్మ పేరున ఒక మొక్క' కార్యక్రమం ఘనంగా జరిగింది. మండలంలోని హసన్ బాద, ఆదివారపుపేట, కందులపాలెం గ్రామాలలో భారతీయ జనతా పార్టీ, కిసాన్ మోర్చా సంయుక్త ఆధ్వర్యంలో నాయకులు పలుచోట్ల ఉత్సాహంగా మొక్కలు నాటారు. కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి సతీష్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు, మండల బీజేపీ అధ్యక్షుడు ఆకేటి శ్రీ కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి పుల్లెల రామమూర్తి, మండల ఓబీసీ అధ్యక్షుడు ఇంధన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే హసన్ బాద గ్రామ పంచాయతీ ఆవరణలో డిప్యూటీ ఎంపీడీఓ శివప్రసాద్ మొక్కలు నాటి పర్యావరణ స్పృహను చాటారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి సతీష్ రావు మాట్లాడుతూ మానవ జీవనానికి పర్యావరణమే ప్రాణాధారమని స్పష్టం చేశారు. స్వచ్ఛమైన గాలి, నీరు, నేల, పచ్చదనం మనతో పాటు భవిష్యత్ తరాలకు ఎంతో అవసరమని, పెరుగుతున్న కాలుష్యం, అడవుల నరికివేత వంటివి వాతావరణ మార్పులకు దారితీస్తూ ప్రపంచానికి పెను సవాలుగా మారాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా కనీసం ఒక మొక్క నాటాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి నీటిని ఆదా చేయాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్థులకు ఆయన పిలుపునిచ్చారు. మనం తీసుకునే చిన్న చిన్న చర్యలే సమాజంలో పెద్ద మార్పులకు దారి తీస్తాయని ఆయన వివరించారు. ఇదే వేదికపై ప్రధాని మోదీ 12 ఏళ్ల సుపరిపాలనలో దేశంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను సైతం ఆయన ప్రజలకు వివరించారు. ఈ పర్యావరణ హిత కార్యక్రమంలో బీజేపీ, కిసాన్ మోర్చా నాయకులతో పాటు పంచాయతీ కార్యదర్శి సబ్బెల్ల ప్రసాద్ రెడ్డి, సచివాలయ రెవెన్యూ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# మానవ మనుగడకు చెట్లే ఆధారం

## రామచంద్రపురంలో ఉత్సాహంగా పర్యావరణ సైకిల్ ర్యాలీ



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు రామచంద్రపురంలో సైకిల్ ర్యాలీ ఉత్సాహంగా జరిగింది. కూటమి పార్టీల సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమై మెయిన్ రోడ్డు మీదుగా రాజగోపాల్ సెంటర్ వరకు సాగింది. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించే లక్ష్యంతో నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని గుర్తుచేశారు. మానవ మనుగడకు చెట్లే ప్రధాన ఆధారమని స్వచ్ఛమైన గాలి, సమృద్ధిగా వర్షాలు కురవాలన్నా పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉండాలన్నా చెట్లను రక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలని పెరుగుతున్న కాలుష్యం, అధిక ఉష్ణోగ్రతలు ప్రపంచానికి పెను సవాళ్లుగా మారుతున్న తరుణంలో ప్రకృతిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం జనసేన పార్టీ ఇన్చార్జి శ్రీ పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. దైనందిన జీవితంలో సైకిల్ వినియోగాన్ని పెంచడం ద్వారా ఇంధన పొదుపుతో పాటు వాయు కాలుష్యాన్ని సమర్థవంతంగా అరికట్టవచ్చని సూచించారు. ప్రతి కుటుంబం విధిగా కనీసం ఒక మొక్కనైనా నాటి సంరక్షించాలని ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ఒక్కరోజుకే పరిమితం చేసే కార్యక్రమం కాకూడదని దానిని ఒక నిరంతర బాధ్యతగా స్వీకరించి భావితరాలకు పచ్చని భూమిని అందించాలని నియోజకవర్గ పరిశీలకురాలు శ్రీమతి మజ్జి పద్మావతి ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జాస్తి విజయలక్ష్మి, పట్టణ మహిళా అధ్యక్షురాలు వజ్రపు రాజేశ్వరిలతో పాటు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, యువత మరియు స్థానిక ప్రజలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# తల్లి ఒడిలాంటి ప్రకృతిని పరిరక్షించుకోవాలి

## ద్రాక్షారామంలో ఉత్సాహంగా మొక్కలు నాటే కార్యక్రమం



**ద్రాక్షారామం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం మండలం ద్రాక్షారామం గ్రామంలోని గురుకుల పాఠశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ శ్రీ పోలిశెట్టి చంద్రశేఖర్, ఎంపీడీఓ పద్మజ్యోతి, రామచంద్రపురం రూరల్ టీడీపీ మండల అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు తదితరులు పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమానికి ముందుగా పాఠశాల ప్రాంగణంలో ఉన్న భారత రత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ తల్లి ఒడి లాంటి ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. భూమిపై జీవరాశుల మనుగడకు స్వచ్ఛమైన గాలి, నీరు అత్యంత ఆవశ్యకమని వాటి పరిరక్షణలో చెట్లే ప్రధాన పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఒక చెట్టు తన జీవితకాలంలో మానవాళికి వేలాది రూపాయల విలువైన ఆక్సిజన్‌ను ఉచితంగా అందించడమే కాకుండా ప్రకృతిలో వాతావరణ సమతుల్యతను కాపాడుతుందని వివరించారు. ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, ఉష్ణోగ్రతల పెరుగుదల వంటి తీవ్ర సమస్యలకు చెట్ల పెంపకమే శాశ్వత పరిష్కారమని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని పెద్ద చెట్టుగా పెంచే వరకు సంరక్షించే బాధ్యత తీసుకున్నప్పుడే ఇలాంటి కార్యక్రమాలు విజయవంతమవుతాయని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి ప్రజలు పూర్తి మద్దతు, సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు స్థానిక ప్రజలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడితేనే మన మనుగడ : న్యాయమూర్తి లక్ష్మీకుమారి



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రకృతి లేనిదే ప్రగతి లేదని పర్యావరణం లేనిదే పరవశం లేదని రామచంద్రపురం మండల లోక్ అదాలత్ చైర్మన్ 13వ అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు జడ్జి బి.హెచ్.వి. లక్ష్మీకుమారి స్పష్టం చేశారు. పర్యావరణాన్ని కాపాడితేనే మన మనుగడ సాధ్యమని లేకుంటే మానవ జీవితం భవిష్యత్తులో ప్రశ్నార్థకంగా మారుతుందని ఆమె అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆమె స్థానిక కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీ కోటిపల్లి లావరాజు మాట్లాడుతూ.. గాలి, నీరు, నేల ఎంతో పవిత్రమైనవని వాటిని కలుషితం చేయకూడదని సూచించారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని విధిగా నిషేధించాలని భావితరాలకు పచ్చని ప్రకృతిని స్వచ్ఛమైన బహుమతిగా అందించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం మండల లోక్ అదాలత్ ఆధ్వర్యంలో పట్టణంలో పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరిస్తూ అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ఈ పర్యావరణ హిత కార్యక్రమంలో పలువురు సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు, లోక్ అదాలత్ ప్యానల్ న్యాయవాదులతో పాటు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం ప్రభుత్వాసుపత్రిలో

# శానిటేషన్ కార్మికుల ధర్నా

## పెరిగిన వేతనాలు చెల్లించాలని సీఐటీయూ డిమాండ్




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు ప్రభుత్వం పెంచిన వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ఆసుపత్రి వద్ద ధర్నా చేపట్టారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం మాట్లాడుతూ ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచడంలో శానిటేషన్ కార్మికుల పాత్ర అత్యంత కీలకమన్నారు. కనీస వేతనం రూ. 26,000 ఉండాల్సి ఉండగా అత్యల్ప వేతనాలతోనే వారు తమ ఆత్మగౌరవాన్ని చంపుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల విన్నపాల మేరకు ప్రభుత్వం వారి వేతనాన్ని రూ. 18,600లకు పెంచినప్పటికీ కాంట్రాక్టర్ ఆ మొత్తాన్ని ఇవ్వకుండా పాత జీతాలే ఇస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. ఈ విషయమై కాంట్రాక్టర్ తో పాటు ఆసుపత్రి సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేకపోయిందన్నారు. చివరకు ఈ సమస్యను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గారి దృష్టికి తీసుకెళ్లగా.. పెరిగిన వేతనాలు వెంటనే చెల్లించాలని ఆయన కాంట్రాక్టర్ ను ఆదేశించినప్పటికీ మంత్రి మాటలను సైతం కాంట్రాక్టర్ బేఖాతరు చేయడం దారుణమన్నారు. న్యాయంగా రావాల్సిన జీతాలు అడిగిన పాపానికి కార్మికులను కాంట్రాక్టర్ తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నారని కక్ష సాధింపు చర్యల్లో భాగంగా వారి డ్యూటీ వేళలను మార్చివేశారని బలరాం మండిపడ్డారు. ఈ మార్పుల వల్ల రాత్రి 10 గంటల వరకు డ్యూటీ చేయాల్సి వస్తుండటంతో మహిళా కార్మికులు ఇళ్లకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం పెంచిన జీతాలను బకాయిలతో (ఏరియర్స్) సహా తక్షణమే చెల్లించాలని పాత పద్ధతిలోనే డ్యూటీ వేళలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆసుపత్రిలో పడకల సంఖ్య పెరిగిన దృష్ట్యా దానికి తగ్గట్టుగా కార్మికుల సంఖ్యను కూడా పెంచాలని, ప్రతి నెలా 7వ తేదీ లోపు తప్పనిసరిగా జీతాలు చెల్లించాలని ఆయన కోరారు. శానిటేషన్ కార్మికుల సమస్యలను రాబోయే 14 రోజుల్లోగా పరిష్కరించకపోతే గడువు ముగిసిన తర్వాత ఎప్పుడైనా సమ్మెలోకి వెళ్తామని సీఐటీయూ నాయకులు ఈ సందర్భంగా కాంట్రాక్టర్ కు, అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో పెద్ద ఎత్తున శానిటేషన్ కార్మికులు పాల్గొన్నారు.

# అమలాపురం మలబార్ గోల్డ్ & డైమండ్స్‌లో డైమండ్ షో ప్రత్యేక ప్రదర్శన

## ఆకట్టుకుంటున్న వజ్రాభరణాల కలెక్షన్లు.. – వినియోగదారుల నుంచి విశేష స్పందన




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ ఆభరణాల విక్రయ సంస్థ మల్బార్ గోల్డ్ అండ్ డైమండ్స్ అమలాపురం షోరూంలో నిర్వహిస్తున్న డైమండ్ షోకు వినియోగదారుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. వజ్రాభరణాలపై ఆసక్తి కలిగిన ఖాతాదారులను ఆకట్టుకునేలా ప్రత్యేక ప్రదర్శనను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ రకాల డైమండ్ నెక్లెస్‌లు, చెవిపోగులు, ఉంగరాలు, బ్రేస్‌లెట్లు, పెండెంట్లు తదితర వజ్రాభరణాలను ప్రత్యేకంగా ప్రదర్శనకు ఉంచారు. ఆధునిక ఫ్యాషన్‌కు అనుగుణంగా రూపొందించిన సరికొత్త డిజైన్లు, నాణ్యమైన వజ్రాభరణాల కలెక్షన్లు వినియోగదారులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. డైమండ్ షోలో భాగంగా కస్టమర్ల కోసం ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. వజ్రాభరణాల విలువపై 30 శాతం వరకు తగ్గింపు కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దీంతో వివాహాలు, శుభకార్యాలు, ప్రత్యేక సందర్భాల కోసం వజ్రాభరణాలను కొనుగోలు చేయాలనుకునే వారికి ఈ ప్రదర్శన మంచి అవకాశంగా మారింది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించిన వజ్రాభరణాల విస్తృత శ్రేణిని ఒకేచోట అందుబాటులో ఉంచినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రతి వయసు వారికి నచ్చే విధంగా సంప్రదాయ, ఆధునిక డిజైన్లలో ఆభరణాలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ఈ ప్రత్యేక డైమండ్ షో సందర్భంగా అందిస్తున్న ఆఫర్లు జూన్ 9, 2026 వరకు కొనసాగనున్నాయని తెలిపారు. అమలాపురం మరియు పరిసర ప్రాంతాల వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన వజ్రాభరణాలను ప్రత్యేక రాయితీలతో కొనుగోలు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్

శనివారం, 06 జూన్ 2026
www.viswamvoice.com





# అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం : కలెక్టర్ మహేష్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మానసిక ప్రశాంతతను, సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించే అద్భుత జీవన విధానమే యోగా అని, నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడిని జయించడానికి యోగా ఎంతో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన అమలాపురంతో పాటు అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాల్లో యోగా ప్రదర్శనలకు వేదికలను సిద్ధం చేయాలన్నారు. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు.విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా విశిష్టతపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను మూడు వయో విభాగాల్లో గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో నిర్వహించాలని సూచించారు. ముందుగా మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 7వ తేదీన జీవీఎంసీ బాలయోగి స్టేడియంలో రైతులతో వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖల ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఈ నెల 10వ తేదీన హరిత కోకోనట్ రిసార్ట్స్‌లో 500 మందితో టూరిజం డెస్టినేషన్ యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 13వ తేదీన అంతర్వేది బీచ్‌లో సుమారు 500 మందితో యోగా కార్యక్రమం నిర్వహించాలన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో సామూహిక యోగాసనాల ప్రదర్శన చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమాలు జరిగే ప్రాంతాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వైద్య శిబిరాలు, అవసరమైన కార్పెట్లు, యోగా మ్యాట్లు ఏర్పాటు చేయాలని మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. యోగా అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, మానసిక ప్రశాంతతకు కూడా ఎంతో ఉపకరిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. జూన్ 21న నిర్వహించే ఈ ఆరోగ్య యజ్ఞంలో జిల్లా ప్రజలందరూ భాగస్వాములు కావాలని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగంగా మార్చుకుని ఆరోగ్యకరమైన జీవనం గడపాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ వైభం నైడయా దేవి, ఆర్డీవోలు, జిల్లా విద్యాశాఖ అధికారి పి. నాగేశ్వరరావు, జిల్లా పర్యాటక అధికారి అన్వర్ హుస్సేన్, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ శ్యాంసుందర్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, యోగా సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ వజ్రప్రహార్‌లో భారీ కార్డెన్ సెర్చ్


### అంబాజీపేటలో ముమ్మర తనిఖీలు – గంజాయి రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం




**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ వజ్రప్రహార్" కార్యక్రమంలో భాగంగా డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీసు శాఖ అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపింది. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ ఆదేశాల మేరకు శుక్రవారం తెల్లవారుజాము నుంచే కొత్తపేట సబ్ డివిజన్ పరిధిలోని అంబాజీపేట పోలీస్ స్టేషన్ పరిధి మెట్ల కాలనీలో భారీ కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీలను కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ పర్యవేక్షించగా, పి.గన్నవరం సీఐ ఆర్. భీమరాజు, ఈగల్ వింగ్ సీఐ వెంకటేశ్వరరావు, అంబాజీపేట ఎస్సై షేక్ సుభాని, నగరం ఎస్సై చైతన్యకుమార్, పి.గన్నవరం ఎస్సై శివకృష్ణ, అయినవిల్లి ఎస్సై జ్యోతి తదితరులు తమ సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. కాలనీలోని ప్రతి ఇంటిని, అనుమానాస్పద వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆపరేషన్‌లో భాగంగా కొత్తగా కాలనీల్లోకి వచ్చిన వ్యక్తుల వివరాలను సేకరించి ఆధార్ కార్డులను పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనాలు, నంబర్ ప్లేట్లు సక్రమంగా లేని వాహనాల వివరాలను ఆన్‌లైన్ ద్వారా ధృవీకరించారు. అలాగే గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, నిల్వలను అరికట్టేందుకు ప్రత్యేక సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సుంకర మురళీమోహన్ మాట్లాడుతూ గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ సాధనే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. యువతకు డ్రగ్స్, గంజాయి వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. దొంగ వాహనాల కొనుగోలు, విక్రయాలకు పాల్పడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. గంజాయి, డ్రగ్స్‌కు బానిసలైన వ్యక్తులు సమాజంలో నేరాలకు, మహిళలపై వేధింపులకు పాల్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొంటూ, అలాంటి వారిని గుర్తించి పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజల సహకారం అవసరమన్నారు. ఈ మేరకు స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లాలో నేరాలకు తావులేకుండా చేయడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. "ఆపరేషన్ వజ్రప్రహార్ ద్వారా అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజలు భయం లేకుండా పోలీసులకు సహకరించాలి. అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే 100 లేదా 112 నంబర్లకు సమాచారం అందించాలి అని ఆయన పిలుపునిచ్చారు.

# కొత్తపేట విద్యుత్ డివిజన్ ఈఈగా బాధ్యతలు స్వీకరించిన రాంబాబు

### నూతన విద్యుత్ డివిజన్ ఏర్పాటు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కొత్తపేట కేంద్రంగా నూతన విద్యుత్ డివిజన్ ఏర్పాటైంది. కొత్తపేట నియోజకవర్గ శాసనసభ్యులు బండారు సత్యానందరావు కృషి ఫలితంగా ఏర్పాటైన ఈ నూతన విద్యుత్ డివిజన్‌కు ప్రథమ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)గా కొత్తపల్లి రాంబాబు బాధ్యతలు స్వీకరించారు. ఈ కొత్త డివిజన్ పరిధిలోకి కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు, పి. గన్నవరం, మామిడికుదురు, రాజోలు, మలికిపురం మరియు సఖినేటిపల్లి మండలాలు వస్తాయి. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన నూతన ఈఈకి కొత్తపేట, పి. గన్నవరం, రాజోలు నియోజకవర్గాల శాసనసభ్యులు, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది మరియు పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఈఈ కొత్తపల్లి రాంబాబు మాట్లాడుతూ కొత్త డివిజన్ ఏర్పాటుతో విద్యుత్ వినియోగదారులకు మరింత వేగవంతమైన, నాణ్యమైన, సమర్థవంతమైన సేవలు అందుతాయని, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

### పరుగులు పెడుతున్న అభివృద్ధి, సంక్షేమం

# సుపరి పాలనకు రెండేళ్లు

### ప్రగతి పదంలో ఆంధ్రప్రదేశ్




**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో సుపరిపాలన జరుగుతోందనీ సీనియర్ టిడిపి నాయకులు గుబ్బల మూర్తి తెలియజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నేటితో రెండు సంవత్సరాలు పాలన పూర్తయింది. ఈ రెండేళ్లలో అనేక అభివృద్ధి పనులు సంక్షేమ పథకాలు అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్‌ల కలయికలో అభివృద్ధి పరుగులు పెడుతోంది.సంక్షేమం ఉరకలు వేస్తోంది కేంద్రం నుండి బిజెపి సర్కార్ సహాయపడుతోంది. అటు కేంద్రం ఇటు రాష్ట్రం సమిష్టి కలయికతో డబల్ ఇంజన్ సర్కార్ పాలన ప్రజా ఆదరణ పొందుతోంది. ఏపీకి పెద్దఎత్తున పెట్టుబడులు వచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తోంది. కృషి ఫలితంగా పాలనపై నమ్మకంతో రాష్ట్రానికి నూతన పరిశ్రమలు వచ్చాయి. అనేక పరిశ్రమలు మన రాష్ట్రం వైపు చూస్తున్నాయి. దేశంలో వివిధ రాష్ట్రాలు ప్రపంచ దేశాలను ఆశ్చర్యపరుస్తూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గూగుల్ సంస్థ వైజాగ్‌లో నెలకొల్పుతున్నారు. అమరావతి రాజధాని నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి.ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారు.మహిళలకు ఉచిత బస్సు, ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, విద్యార్థులు ఉన్నతంగా చదువుకునేందుకు తల్లికి వందనం రైతులకు అన్నదాత సుఖీభవ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నియామకానికి మెగా డీఎస్సీ నిర్వహించి ఉద్యోగ కల్పన చేశారు.పేద వారికి పట్టెడు అన్నం పెట్టే అన్నా క్యాంటీన్ లను గత ప్రభుత్వం రద్దు చేసింది.265 అన్న క్యాంటీన్ లను కూటమి ప్రభుత్వం పునరుద్ధించి ఐదు రూపాయలకే పేదవారి ఆకలి తీరుస్తున్నారు.కొత్తపేట నియోజకవర్గంలో అనుభవజ్ఞుడైన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనకున్న అనుభవంతో అభివృద్ధిని సునాయసంగా చేయగలుగుతున్నారు. రెండేళ్లలో నియోజకవర్గంలో వందల కోట్లలో అభివృద్ధి జరిగిందంటే ఆయన యొక్క అనుభవం, చాతుర్యతను తెలియజేస్తుంది.అభివృద్ధి పట్ల ఆయనకున్న నిబద్ధత కనబడుతుంది.ఎన్నో ఏళ్లగా అభివృద్ధికి నోచుకోని రోడ్లను నిర్మించారు.రైతులకు ఉపయోగపడే లొల్లలాకుల ఆధునీకరణకు నిధులు మంజూరు చేయించారు. ప్రముఖ పుణ్యక్షేత్రం వాడపల్లి దేవాలయ అభివృద్ధికి కంకణ బద్ధుడై పనిచేస్తున్నారు. నియోజకవర్గంలో పలు దేవాలయాల పనుల అభివృద్ధి విధుల కొరకు పాటుపడుతున్నారు. మందపల్లి వానపల్లి చింతలూరు ర్యాలీ దేవాలయాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. నూతన భవనాలు నిర్మిస్తున్నారు.వివిధ అనారోగ్యాల బారినపడి వైద్యం చేయించుకున్న పేదవారికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు మంజూరు చేయించారు. వారి కుటుంబాలకు భరోసా కల్పించారు.గ్రామ గ్రామాన అభివృద్ధి జరుగుతోంది. బ్రిడ్జిలు భవనాలు రోడ్లు డ్రైనేజీ నిర్మాణాలతో అభివృద్ధి కళ్ళకు కట్టినట్టు కనిపిస్తుంది.గత ప్రభుత్వంలో పథకాలకు ఇచ్చిన ప్రాధాన్యత అభివృద్ధి వైపు చూపించలేదు.అభివృద్ధి కుంటు పడింది. మహిళలపై అత్యాచారాలు అనుమానాస్పద మృతులు, హత్యలు, మనుషులను చంపి డోర్ డెలివరీ చేయడం వంటి హింసాత్మక సంఘటనలతో రావణ కాష్టంలా తగలబడుతున్న రాష్ట్రాన్ని నేడు ప్రగతి పదంలో తీసుకు వెళుతున్న ఘనత కూటమి ప్రభుత్వానిది. ప్రజలు మెచ్చే రీతిలో పరిపాలన సాగిస్తున్న ప్రభుత్వాన్ని మంచి ప్రభుత్వంగా ప్రజలు కితాబు ఇస్తున్నారు అన్నారు.

### పర్యావరణ పరిరక్షణ

# ప్రజలందరి సమిష్టి బాధ్యత


### ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు స్థానిక శాసనసభ్యులు బండారు సత్యానంద రావు పాల్గొన్న పలు కార్యక్రమాలలో భాగంగా కొత్తపేట బస్టాండ్ సెంటర్లో ప్రియదర్శని బాలవిహార్ కరస్పాండెంట్ అద్దంకి బుద్ధ చంద్రదేవ్ రాసిన " బుద్ధ శోధన – జ్ఞాన సాధన" (దీర్ఘ కవిత), "పర్యావరణ పరిరక్షకులందరూ బౌద్ధులే!"(పరిశోధనా వ్యాసం)"లేతహృదయాల్లో బుద్ధోదయం ఎలా?" (సమాలోచన) అన్న బహు విషయ గ్రంథాన్ని ఆవిష్కరించారు. తదనంతరం రేపటి నుంచి రాజమహేంద్రవరంలో చైతన్య సారస్వత పరిషత్, శ్రీశ్రీ కళావేదికల సంయుక్త నిర్వహణలో జరగబోయే ప్రపంచ తెలుగు మహాసభల బ్రోచర్ ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి కళాసాహితి తరపున అధ్యక్షులు హరిహర దేవళరాజు, శ్రీ శ్రీ కళా వేదిక తరపున జాతీయ కార్యదర్శి జినిపే భీమారావు హాజరుకాగా రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంత కుమారి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంఠంశెట్టి శ్రీనివాసరావు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ముత్యాల బాబ్జి, మాజీ జెడ్పిటిసి సభ్యులు ధర్నాల రామకృష్ణ, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ మిద్దె ఆదినారాయణ, రాష్ట్ర బీసీ నాయకులు ఎల్లమెల్లి జగన్మోహన్ రావు, కొత్తపేట మాజీ సర్పంచ్ బూసి జయలక్ష్మి భాస్కరరావు, మందపల్లి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు దేవపాటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ సభ్యుడు బీర ఇసాక్, మండల అభివృద్ధి అధికారి పియస్ నరేష్ కుమార్, మండల విద్యాశాఖ అధికారి ఎమ్ హరిప్రసాద్, గ్రామపంచాయతీ కార్యదర్శి దాసరి వెంకటేశ్వర రావు, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్ సురేంద్ర బాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడుట మన బాధ్యత

### ప్రకృతిని పరిరక్షిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం..



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పర్యావరణాన్ని రక్షించి వాతావరణ కాలుష్యాన్ని అరికడదాం.ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కాలుష్యాన్ని నివారించాలని ప్రజలకు సందేశం అందించేందుకు తను తన మనవడు సత్యాన్స్ ఇద్దరూ సైకిల్ పై ప్రయాణం చేశారు. తనతోపాటు భవిష్యత్తు తరానికి చెందిన మనవడు కూడా సైకిల్ పై ప్రయాణం చేసి భవిష్యత్తు తరాలకు మంచి సందేశాన్ని ఇచ్చారు.భవిష్యత్ తరాలుకు ఆరోగ్యకరమైన భవిష్యత్తు అందించాలంటే కాలుష్యాన్ని నివారించాలని ఈ సందర్భంగా కోరారు. పర్యావరణాన్ని కాపాడేందుకు గాను మొక్కలు పెంచుదాం ప్లాస్టిక్ను నివారిద్దాం భూమిని కాపాడుదాం అంటూ సైకిల్ పై రైడ్ చేస్తూ నినాదాలు చేశారు.సైకిల్ ర్యాలీలో కూటమి నాయకులతో పాటు సీనియర్ టిడిపి నాయకులు గుబ్బల మూర్తి పాల్గొని పర్యావరణాన్ని రక్షించుకోవాలసిన బాధ్యత మన అందరిపై ఉందని తెలియజేశారు.

# "అమ్మ పేరుతో ఒక మొక్క"నాటుదాం..

### రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం




**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మోడీ ప్రధాన మంత్రి అయ్యి 12 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా, అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం' పురస్కరించుకొని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావలని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం పిలుపునిచ్చారు. శుక్రవారం మందపల్లి దేవస్థానం పాలకమండలి సభ్యులు కోటిపల్లి సుబ్బలక్ష్మి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా బోడిపాలెం వంతెన వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రకృతే పరమాత్మగా భావించే మన సంస్కృతిలో పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని గుర్తుచేశారు. గ్లోబల్ వార్మింగ్, అనావృష్టి వంటి పర్యావరణ సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో మొక్కలు నాటడం ఎంతో ఆవశ్యకమని స్పష్టం చేశారు. అమ్మ పేరిట ఒక మొక్క నాటాలి అని ప్రధాని మోదీ అద్భుతమైన పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ మాతృమూర్తి (అమ్మ) పేరిట కనీసం ఒక మొక్కనైనా నాటాలి. మొక్కను నాటడమే కాకుండా, అది వృక్షంగా ఎదిగేంత వరకు దాన్ని పరిరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలి. ముఖ్యంగా మన జిల్లాలోని రైతు సోదరులు తమ పొలాల గట్ల వెంబడి, ఖాళీ స్థలాలలో నీడను, పండ్లను ఇచ్చే మొక్కలను నాటడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషించాలి.?"మనకు జన్మనిచ్చిన అమ్మ రుణం తీర్చుకుంటూ మనకు సర్వస్వాన్ని ఇస్తున్న భూమాతను కాపాడుకోవడానికి ఈ పర్యావరణ దినోత్సవం నాడు 'అమ్మ పేరుతో ఒక మొక్క' నాటి పచ్చని కోనసీమను మరింత సుందరంగా తీర్చిదిద్దుకుందాం" అని పాలూరి కోరారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ డైరెక్టర్ గొలకోటి వెంకటేశ్వరరావు, ఆత్మ కమిటీ డైరెక్టర్ లు మద్దంశెట్టి శ్రీనివాసరావు, పాలాటి మాధవ స్వామి, రాష్ట్ర యువ మోర్చా నాయకులు పాలూరి జయ ప్రకాష్ నారాయణ, యువ మోర్చా నాయకులు కోటిపల్లి దామోదర్, అన్యం సత్యనారాయణ, అజ్జరపు సత్యనారాయణ, ఎస్ సి మోర్చా మండల అధ్యక్షులు శివ రామకృష్ణ, కోటిపల్లి రఘు రామ్,సిద్ధంశెట్టి గంగారావు, చోడపనీడి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడుకోకపోతే నష్టపోయేది మనమే

### పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత : ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** నా దేశం, నా బాధ్యత అనే ఉద్దేశంతో ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలి. కొత్తపేటలో నిర్వహించిన పర్యావరణ దినోత్సవం లో ఎమ్మెల్యే బండారు. రూ.5.22 లక్షల విలువైన ఈ కార్టు వాహనాలను మోడేకుర్రు గ్రామపంచాయతీకి అందించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు భగవంతుడు అందించిన ప్రకృతి వనరులైన భూమి,నీరు, గాలి మొదలైనవన్నీ కలుషితం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోకపోతే నష్టపోయేది మనమేనన్నారు. భవిష్యత్తులో అనారోగ్య ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలంటే, ఆరోగ్యకరమైన సమాజం పెంపొందాలంటే గాలి కాలుష్యం లేకుండా, నీటి కాలుష్యం లేకుండా, భూమి, వాతావరణం కలుషితం కాకుండా, మన పరిసరాలు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా కొత్తపేటలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే బండారు వాడపాలెం స్వగృహం నుంచి కమ్మిరెడ్డి పాలెం వరకూ సైకిల్ పై వెళ్ళారు. అనంతరం కమ్మిరెడ్డి పాలెం నుంచి కొత్తపేట బస్టాండ్ సెంటర్ వరకూ సైకిల్ ర్యాలీ నిర్వహించారు.ఎమ్మెల్యే బండారు మనవడు సత్యాన్ష్ సైతం ఈ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మోడేకుర్రు పంచాయితీకి శ్రీ దీప్తి ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఓఎన్జిసి రాజమండ్రి సి ఎస్ ఆర్ ఫండ్స్ తో అందించిన రెండు ఈ కార్ట్ ఆటోలను ఎమ్మెల్యే మరియు రాష్ట్ర బి.సి కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతిని సంరక్షించాలని, మొక్కలు నాటాలని, చెట్లు నరకకుండా చూడాలని తెలిపారు. ప్లాస్టిక్ ని పూర్తిగా నిరోధించాలన్నారు. ప్లాస్టిక్ స్థానంలో జ్యూట్ తదితర పర్యావరణహిత వస్తువులను వినియోగించాలన్నారు. గ్లోబల్ వార్మింగ్ ను నియంత్రించాలన్నారు.మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి ప్రజలు సైతం తోడ్పాటు అందించాలన్నారు. అధికారులు, నాయకులపై పూర్తిగా ఆధారపడడం కాకుండా అందరూ ఈ క్రతువులో భాగస్వాములు కావాలన్నారు. పశ్చిమాసియాలో సంభవించిన యుద్ధ వాతావరణం కారణంగా సంభవించిన ఇంధన కొరత మొదలైన పరిస్థితుల వల్ల ఇంధన పొదుపుపై అవగాహనతో ఈవీ వాహనాలు వినియోగించాలని, సైకిళ్లు వినియోగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారని తెలిపారు. వైజాగ్ లో నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్ఫూర్తిదాయకంగా సైకిల్ ర్యాలీలో పాలుపంచుకుంటున్నారని కొనియాడారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గోదావరి కాలుష్యాన్ని ఏ విధంగా నియంత్రించాలనేది తెలియజేయడం జరిగిందన్నారు. ప్రధాని మోదీ స్వచ్ఛభారత్ పై ఎన్నో ఏళ్లుగా కృషి చేస్తూ అవగాహన కల్పిస్తున్నారన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ ప్రతీ మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించుకుంటున్నారు. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వం తరపున ఎలక్ట్రిక్ వెహికల్స్ ను ప్రమోట్ చేస్తున్నారని తెలిపారు. రూ.5.22లక్షల విలువైన రెండు ఈ కార్ట్ ఆటోలను దీప్తి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఓఎన్జిసి రాజమండ్రి సిఎస్ఆర్ నిధులతో మోడేకుర్రు పంచాయతీకి అందించడం జరిగిందన్నారు. ఇటువంటి ఈ కార్ట్ ఆటోలను ప్రతి పంచాయతీకి అందించే ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛ రథంతో చెత్తకు సైతం సంపదను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సైకిల్ ను వినియోగించడం వల్ల ఆరోగ్యం పెంపొందుతుందని, వాయు కాలుష్యం తగ్గుతుందని, విదేశీ మారక ద్రవ్య నిల్వలు తగ్గకుండా ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ నాదేశం నా బాధ్యత అనే ఉద్దేశంతో ముందుకు వెళ్లాలన్నారు. ఇంధన వినియోగంలో పొదుపు పాటిస్తూ ఈవీ వాహనాలు, సైకిళ్ల వైపు మొగ్గు చూపాలన్నారు. వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించడానికి కావాల్సిన చర్యలు అందరూ తీసుకోవాలన్నారు.



# శంఖవరం తహసిల్దారుగా సూరిబాబు నియామకం



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కొత్త తాహసిల్దారుగా మొసలి సూరిబాబు నియమితులు అయ్యారు. ఈయన ఇప్పటి వరకూ కాకినాడ రెవిన్యూ డివిజన్ పరిధిలోని తాళ్ళరేవు మండలం ఉప తాహసిల్దారుగా విధులను నిర్వహిస్తూ తాహసిల్దారుగా ఉద్యోగోన్నతి పొందారు. దీంతో ఈయన నుంచి తాళ్ళరేవు మండలం నుంచి శంఖవరం మండలానికి తాహసిల్దారు ఉద్యగోన్నతిపై బదిలీ అయ్యారు. లోగడ ఈయన ఇక్కడ టైపిస్టుగా ఐదేళ్ళపాటూ సంతృప్తి కరంగా తన సేవలను అందించారు. ఈయన శుక్రవారం నాటికి ఇంకా శంఖవరం మండలం విధుల్లోకి చేరలేదు. ప్రస్తుతం వరకూ శంఖవరం మండల తాహసిల్దారుగా విధులను నిర్వర్తించిన అల్లాడి తాతారావు కాకినాడ ఆర్డీవో కార్యాలయ పరిపాలనా అధికారిగా ఉద్యోగోన్నతిని పొందారు. ఈయన కూడా ఇంకా కాకినాడ విధుల్లో చేరలేదు. ఈయన శుక్రవారం కూడా శంఖవరం మండలం తాహసిల్దారు విధుల్లోనే ఉన్నారు. శంఖవరం మండలంలోని అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానానికి సత్యదేవుని దర్శనానికి వచ్చిన ఒక ఉన్నత అధికారి ప్రోటోకాల్ విధుల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ అల్లాడి తాతారావు పాల్గొన్నట్లు ఆయనే వెల్లడించారు.

# ప్రజా నాయకుడు ప్రస్థానానికి రెండేళ్లు పూర్తి

## అభినందనలు తెలిపిన జనసేన నాయకులు డాక్టర్ బొండా సూర్యారావు



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ నియోజకవర్గంలో ఇప్పటివరకు ఏ పార్టీ నాయకుడు సాధించని అత్యధిక మెజార్టీ 72000 తో జనం ఆదరణ పొందిన ఏకైక నాయకుడు పంతం నానాజీ కాకినాడ రూరల్ శాసనసభ్యులుగా ప్రస్థానం రెండు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఆయనకు జనసేన నాయకులు డాక్టర్ బోండా సూర్యరావు అభినందనలు తెలియజేశారు. ఎలక్షన్ ప్రసారంలోఎమ్మెల్యే నానాజీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ కాకినాడ రూరల్ ను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నారని కనీవిని ఎరుగని రీతిలో అభివృద్ధి పనులు ఎక్కడికి వెళ్లిన దర్శనమిస్తున్నాయని ఈ విషయంలో జనసేన పార్టీ క్యాడర్ మొత్తం సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ఉపముఖ్యమంత్రి జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నిత్యం ప్రజా సమస్యలపై స్పందిస్తున్న జన సైనికులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఘనంగా శ్రవణా నక్షత్ర పూజలు



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రవణా నక్షత్ర సందర్భంగా శుక్రవారం స్థానిక సత్యదేవ మందిర ప్రాంగణంలో పురుషోత్తమ అధికమాస మాస సందర్భంగా శ్రీదేవి భూదేవి సహిత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి విశేష కళ్యాణ పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సమాచారం ప్రధాన ఇంచార్జ్ సంపాదకులు ఏఆర్ వి సత్యనారాయణ( రాజమండ్రి) ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వేద పండితులు యాతగిరి మద్వేర్ ఆధ్వర్యంలో భక్తుల చేత ఈ కళ్యాణోత్సవ కార్యక్రమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో జరిపించారు . కళ్యాణ అనంతరం స్వామివారికి నూతన వస్త్ర సమర్పణ చేసే విశేష సేవా కార్యక్రమం పట్ల భక్తులు ఎంతగానో తన్మయత్వం పొందుతున్నారు రేగడమిల్లి కృష్ణమూర్తి కళ్యాణి దంపతులు కళ్యాణోత్సవ కార్యక్రమంలో విశేష నూతన వస్త్రాలను స్వామివారి అలంకరణ నిమిత్తం సమర్పించుకున్నారు. సమాచారం సత్యనారాయణ మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో మద్వేష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం అభినందనీయమని అన్నారు. శ్రీనివాస కల్యాణోత్సవ కార్యక్రమాన్ని స్వయంగా భక్తుల చేత నిర్వహించడం ఒక అరుదైన అదృష్టంగా భావిస్తున్నామని ప్రస్తావించారు. స్వామివారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రం రోజున కళ్యాణోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని అన్నారు. నేటి యువతరానికి ఆధ్యాత్మిక సంపదను అందించడంలో నిత్యము వివిధ కార్యక్రమాల రూపంలో మద్వేష్ చేస్తున్న పూజా కార్యక్రమాల వల్ల సమాజానికి ఎంతో మేలు జరుగుతుంద ఆయన అన్నారు. మందిర నిర్వాహకులు డాక్టర్ పరశు రామ్ మాట్లాడుతూ అధికమాస కార్యక్రమంలో ప్రతిరోజు శ్రీనివాస కళ్యాణం విశేష సేవా కార్యక్రమం నిర్వహించడమే కాక భక్తులను భాగస్వామ్యం చేయడం కూడా గొప్ప విషయమని అన్నారు. దేశవ్యాప్తంగా పురుషోత్తమ మాస సందర్భంగా విశేష హోమాలు భాగవత ప్రవచనాలు నిర్వహిస్తూ ఉన్నామని, అయితే ఉత్తరాది మఠాధిపతులు శ్రీ సత్యాత్మ తీర్థ స్వామిజి అనుగ్రహంతో ఈ నెల రోజులు పాటు శ్రీదేవి భూదేవి సహిత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవ కార్యక్రమం జరిపించాలన్న సంకల్పంతో గత 20 రోజులుగా ఈ కార్యక్రమం ఎంతో వైభవంగా మద్వేష్ నిర్వహిస్తున్నామని ఇందులో పలువురు భక్తులు స్వయంగాను మరి కొందరు ఆన్లైన్లోనూ పాల్గొంటూ స్వామివారి అనుగ్రహా న్ని పొందారని చెప్పారు. ప్రతిరోజు వేసవి సందర్భంగా స్వామివారి నివేదనలో విశేష పానకాన్ని మరియు వడపప్పును సమర్పించడం జరుగుతుందని చెప్పారు. శ్రీనివాస కళ్యాణోత్సవ సేవాకర్తలుగా ప్రముఖ న్యాయవాది జీవీ కృష్ణ ప్రకాష్, ప్రముఖ వైద్యులు డాక్టర్ తోలేటి బాలకృష్ణ, పోస్టల్ శాఖ విశ్రాంత అధికారిని శ్రీమతి పద్మావతి, ప్రముఖ ఇంజనీర్ బల రామ్, శ్రీనివాస్ టీవీఎస్ విభాగ ఉన్నతాధికారి కె రాఘవేంద్రరావు, గోదావరి ఎరువుల కర్మాగార విశ్రాంతి అధికారి జాగిర్ధర్ ప్రేమ్ కుమార్, విద్యావేత్త డాక్టర్ లోకా రాఘవేంద్రరావు, రేగడమిల్లి కృష్ణమూర్తి, మైలవరపు శ్రీనివాస ఆచార్ (పిఠాపురం) పాలూరి కృష్ణ చైతన్య సతీమణి అమూల్య రుక్మిణి (పలమనేరు) పన్యాల నరసింహారావు( బుజ్జి )పలువురు భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ముత్యాల రాయుడుకు ఘన నివాళులు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ శాసనమండలి సభ్యులు ఏజెన్సీ టైగర్ ముత్యాల ముత్యాల రాయుడు 40వ వర్ధంతి సభ ఏజెన్సీ టైగర్ కీర్తిశేషులు ముత్యాల ముత్యాల రాయుడు మిత్రమండలి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం రాజమహేంద్రవరం కంబాల చెరువు సెంటర్లో ఘనంగా జరిగింది. న్యాయవాది మరియు ముత్యాల రాయుడు మిత్రమండలి వ్యవస్థాపక అధ్యక్షులు సుంకర వెంకట భాస్కర రంగారావు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపకులు మేడా శ్రీనివాస్, జనసేన పార్టీ సీనియర్ నాయకులు, ముత్యాల రాయుడు మిత్రమండలి వాట్సప్ గ్రూప్ అడ్మిన్ గంధం కృష్ణ, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బాలేపల్లి మురళీధర్ ముఖ్య అతిథిలుగా విచ్చేశారు. న్యాయవాదులు ఎన్.ప్రసాద్ రావు నాయుడు, పడాల జయరాం, తలాటం వెంకట పాండురంగారావు, సమైకాంధ్ర ఉద్యమ నేత దేశినిడి బలరాం, చంద్రశేఖర రావు, ప్రముఖ గాయకులు బజ్జిల సత్యనారాయణ, కో రెడ్డి దేవుడు, నారాయణ, అన్నందేవుల సత్య నారాయణమూర్తి అలియాస్ నాని ఇంకా పలువురు ముత్యాల రాయుడు అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ సీనియర్ నాయకులు, ముత్యాల రాయుడు మిత్ర మండలి వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ గంధం కృష్ణ, కంబాల చెరువు సెంటర్ కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ఆకుల వెంకటేశ్వరరావు తదితరులు సమకూర్చిన బియ్యం బస్తాలను రాజమహేంద్రవరం అర్బన్ మరియు రూరల్ ఏరియాలోని పేదలకు పంపిణీ చేశారు.

# డ్రగ్స్ మత్తు పదార్ధాలపై సమాచారం ఇవ్వండి




**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత ప్రభుత్వం నిషేధించిన డ్రగ్స్ ఇతరత్రా మత్తు పదార్థాలు సేవనం, వినియోగం, రవాణా, అమ్మకాలపై తగు రూఢీయైన సమాచారం ఇవ్వాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంరక్షణ అధికారిణి జాగరపు విజయ పిలుపును ఇచ్చారు. ఇండ్లలోనూ, కుటుంబాల్లోనూ, గ్రామాల్లోనూ డ్రగ్స్, పొగాకు, ధూమపానం ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలను గమనించి నట్లయితే వెంటనే తల్లి, దండ్రులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, ఎవరైనా సరే సంబంధిత శాఖల అధికారులకు సమాచారం అందించాలని విజయ సూచించారు. కాకినాడ జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సి.హెచ్.లక్ష్మి ఆదేశాల మేరకు ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ పర్వత వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో శంఖవరం గ్రామంలో "కిషోరి వికాసం" సమ్మర్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కిషోరి వికాసం సెషన్ -11లో భాగంగా డ్రగ్స్, పొగాకు, ధూమపానం, ఇతర మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంరక్షణ అధికారిణి జాగరపు విజయ సభికులను ఉద్దేశించి మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక, ఆర్థిక అనర్థాల గురించి వివరించారు. అలాగే ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం, చెడు అలవాట్లకు దూరంగా ఉండడం, స్వీయ రక్షణ చర్యలను పాటించడం గురించి ఆమె అవగాహన కల్పించారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "కిషోరి వికాసం" వేసవి సమావేశాలు మే 1వ తేదీ నుండి జూన్ 10వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. 11 నుండి 18 సంవత్సరాల వయస్సు కౌమార బాలికలకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. కిషోరి వికాసం కార్యక్రమం ద్వారా ఆరోగ్యం, పోషణ, వ్యక్తిత్వ వికాసం, విద్య యొక్క ప్రాముఖ్యత, లైంగిక ప్రజనన ఆరోగ్యం, బాల్య వివాహాల నివారణ, బాలల రక్షణ తదితర అంశాలపై గ్రామ, వార్డు స్థాయిల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని విజయ తెలిపారు. సెక్టార్ సూపర్వైజర్ బి.వెంకట రజిని మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న బాలికలకు సరైన మార్గదర్శకత్వం అందించడం, వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా ఎదగడానికి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, కౌమార బాలికలు పాల్గొన్నారు.

### జాతీయ ఆహార భద్రత చట్టం

# జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యునిగా మాటూరి సిద్ధార్థ

## ఎమ్మెల్యే ఆదిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన సిద్ధార్థ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జాతీయ ఆహార భద్రత చట్టం అమలును పర్యవేక్షించే జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీలో సభ్యునిగా నియమితులైన మాటూరి సిద్ధార్థ తిలక్ రోడ్డులోని కార్యాలయంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు)ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యం గా రాజమహేంద్రవరం నగరంలో కొన్ని ఆహార భద్రత అంశాలపై ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో ప్రభుత్వం ఆహార నాణ్యత, నిల్వ విధానాలు, పంపిణీ వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. జాతీయ ఆహార భద్రత చట్టం కింద మూడు సంవత్సరాల పదవీకాలంతో ఏర్పాటు చేసిన జిల్లా విజిలెన్స్ కమిటీల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థ, మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీ సేవలు, రేషన్ దుకాణాల పనితీరు, వీధి వ్యాపారుల వద్ద విక్రయించే ఆహార పదార్థాల నాణ్యత వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. చాంబర్ ఆఫ్ కామర్స్‌కు అనుబంధంగా ఉన్న సభ్యుని స్థానానికి పార్టీ తరఫున మాటూరి సిద్ధార్థ పేరును జిల్లా కలెక్టర్‌కు సిఫారసు చేయడం జరిగిందని, ఆయన ప్రజా సమస్యలపై అవగాహనతో పాటు సామాజిక బాధ్యతతో పనిచేసే వ్యక్తి కావడంతో ఈ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారనే నమ్మకం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజా ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విజిలెన్స్ కమిటీలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరుతున్నాయా లేదా అనే అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు, కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా మాటూరి సిద్ధార్థ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ సభ్యునిగా ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, ఆహార భద్రత ప్రమాణాల అమలు, రేషన్ వ్యవస్థ పర్యవేక్షణ, సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత కోసం కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శెట్టి జగదీష్, నిమ్మలపూడి గోవింద్, వ్యాపార వర్గాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది

## డైరెక్టర్ తేతలి సత్య సౌందర్య
## అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పుష్కర ఘాట్‌ను శుభ్రం చేపట్టిన రాజమహేంద్రి కళాశాల విద్యార్థులు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రి మహిళ జూనియర్, డిగ్రీ, పీ.జీ.కళాశాల విద్యార్థినులు గురువారం గోదావరి పుష్కర ఘాట్‌లో పరిశుభ్రత కార్యక్రమం కళాశాల డైరెక్టర్ తేతలి సత్య సౌందర్య ఆధ్వర్యంలో చేపట్టారు అని ఒక ప్రకటనలో ఆమె తెలిపారు. సత్య సౌందర్య మాట్లాడుతూ ఘాట్ పరిసరాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను తొలగించి స్వచ్ఛతకు తమ వంతు సహకారం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినిలు అందించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని విద్యార్థినులు పేర్కొన్నారు.అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేస్తే గోదావరి పుష్కరాలు విజయవంతం అవుతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. గోదావరి పుష్కరాలకు కేవలం సంవత్సరం మాత్రమే సమయం మిగిలి ఉన్నదని, పుష్కర ఘాట్లు, రహదారులు, పారిశుద్ధ్య వసతులు భక్తుల రాకపోకలకు అనుకూలంగా మౌలిక సదుపాయాలు మెరుగుపరకంటే బాగుంటుందని కోరారు. గోదావరి పుష్కరాలకు ఎనిమిది కోట్ల మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు ముందుగానే చేపట్టాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు సమన్వయంతో పనిచేస్తే పుష్కరాలను విజయవంతంగా నిర్వహించవచ్చునని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్.ఎస్.ఎస్. పి.ఓ దంటు వీర వెంకటరావు, అధ్యాపకులు, కళాశాల ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు, విద్యార్థినులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ మన అందరి కర్తవ్యం : డైరెక్టర్ దాలిపర్తి వేమన




**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా రాజమండ్రి రూరల్ నియోజకవర్గం స్థానిక 16వ వార్డు వాంబే గృహాల వద్ద మున్సిపల్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో మొక్కల పెంపకం కార్యక్రమంలో పాల్గొన్న తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కుమ్మర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ దాలిపర్తి వేమన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వం బాధ్యత మాత్రమే కాదు అని, "పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి వ్యక్తి కర్తవ్యం" అని, "పర్యావరణాన్ని మనం పరిరక్షిస్తే అది మనలను కాపాడుతుందని" కనుక ప్రతి ఇంటి ముందు ఒక మొక్కను నాటితే పర్యావరణంలో "ఆక్సిజన్ లెవెల్స్ పెరిగి గ్లోబల్ వార్మింగ్ తగ్గుతుందని", అందువలన ప్రజలకు ఆక్సిజన్ సులభంగా అందుతుందని, "ఆక్సిజన్ యొక్క విలువను మనకు గతంలో కరోనా రుచి చూపిం చిందని" కనుక మన ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ "పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్క వ్యక్తి యొక్క కర్తవ్యం"అని ఈ సందర్భంగా వేమన తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ ల డైరెక్టర్ లు గంట స్వరూప, సయ్యద్ అఫ్సరీ, యానాపు యేసు, యామన నారాయణ, మేక సూర్య భాస్కరరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, తెలుగుదేశం పార్టీ నాయకులు హనుమంతరావు, సత్యనారా యణ, సుబ్బయమ్మ, ఇతర కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# సైకిల్‌పై ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు నగర పర్యటన



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇంధన పొదుపు, పర్యావరణ పరి రక్షణతో పాటు ప్రజలకు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఈ రోజు నగరంలోని పలు ప్రాంతాల్లో నగర అధ్యక్షులు మజ్జి రాంబాబుతో కలిసి సైకిల్‌పై పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలు, ప్రధాన రహదారులు, వ్యాపార ప్రాంతాలు, నివాస ప్రాంతాల్లో సైకిల్‌పై ప్రయాణిస్తూ ప్రజలను ఆప్యాయంగా పలుకరించారు. స్థానికులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు, అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల మరమ్మతులు, వీధి దీపాలు, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలపై ప్రజలు తెలిపిన సమస్యలను శ్రద్ధగా విన్నారు. ప్రజలు సూచించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకోవడం వల్ల సమస్యల పరిష్కారానికి మరింత సమర్థవంతమైన ప్రణాళికలు రూపొందించే అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. సైకిల్ వినియోగం వల్ల ఇంధన వ్యయం తగ్గడమే కాకుండా పర్యావరణ కాలుష్యం నియంత్రణకు కూడా తోడ్పాటునిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ సాధ్యమైనంత మేరకు సైకిళ్లు, రవాణాకు పర్యావరణ హిత మార్గాలను ఉపయోగించాలని సూచించారు. ఆరోగ్య కరమైన జీవనశైలికి కూడా సైక్లింగ్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అంతేకాకుండా నగర అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీల కమని పేర్కొన్న ఆయన, ప్రజల సూచనలు, సలహాలను స్వాగతిస్తున్నా మన్నారు. నగరాన్ని మరింత పరిశుభ్రంగా, అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం, ప్రజలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని వివరించారు. సైకిల్ పర్యటన సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ని కలుసుకుని తమ సమస్యలను వివరించగా, ప్రజల మధ్యకు వచ్చి ప్రత్యక్షంగా పరిస్థితులను తెలుసుకుంటున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. నగర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పునరుద్ఘాటించారు. "ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యతని నగరాన్ని అన్ని రంగాల్లో ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తాం" అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు.

### వాకర్స్ యోగ & లాఫింగ్ క్లబ్ వృద్ధులకు

## నూతన వస్త్రాలు, అన్నదానం, పింఛన్ల పంపిణీ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వాకర్స్ యోగ లాఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్.కె.వి.టి డిగ్రీ కళాశాలలోని ఆనంద గార్డెన్స్ లో క్లబ్ అధ్యక్షులు శనపతి సత్తిబాబు అధ్యక్షతన వృద్ధులకు నూతన వస్త్రాలు, అన్నదానం, పెన్షన్ల పంపిణీ కార్యక్రమాలు శుక్రవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చలపరెడ్డి రాజు, వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 80 మంది వృద్ధులకు ఒక్కొక్కరికి 500 రూపాయల చొప్పున 40 వేల రూపాయలను ముఖ్య అతిథుల చేతుల మీదుగా వృద్ధులకు పింఛన్ల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ క్లబ్ అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలను తమ వంతు అందించడానికి తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు చలపరెడ్డి రాజు, వారి కుటుంబ సభ్యులు వారి కుమారుడు చలపతి గీతా సాయికుమార్ జ్ఞాపకార్థం వృద్ధులకు నూతన వస్త్రాలు అందజేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు వృద్ధులందరికీ దాత పొట్లూరి రామబ్రహ్మం అల్పాహారాన్ని అందించారు. క్లబ్ సెక్రటరీ గుబ్బల గంగాభవాని, వారి స్నేహితులు కలిసి విద్యానిధికి రూ.60,000 క్లబ్ కు అందజేశారు. క్లబ్ ప్రెసిడెంట్ సేనాపతి సత్తిబాబు క్లబ్ విద్యానిధికి 30,000 అందిస్తామని ఈ సంద ర్భంగా వాగ్దానం చేశారు. భారత్ వికాస్ పరిషత్ ప్రెసిడెంట్ బేరి రత్నాంబ స్నూకర్ క్రిడలో జాతీయ స్థాయిలో టాప్-5గా ఉన్న ఉషా జ్యోతి అనే పేద విద్యార్థికి డెహ్రాడూన్ లో జరగబోయే ఆటల పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన ఆర్థిక సహాయం రూ. 15000 అందజేశారు. అనంతరం క్లబ్ సభ్యుల చేతుల మీదుగా ముఖ్య అతిథులకు చిరు సన్మానం జరిగింది. క్లబ్ వ్యవస్థాపకులు పామర్తి గోపాలరావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బేరి రత్నాంబ, లంకే శ్రీదేవి, మొగల్తూరు దుర్గ, భారత్ వికాస్ పరిషత్ సభ్యులు అనసూరి శ్రీనివాస్, ఉప్పులూరి కాశీ విశ్వనాథం, శీలం రామకృష్ణ,పొట్లూరి రామబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## గుత్తుల కృష్ణమూర్తి సేవలు చిరస్మరణీయం

**గుత్తుల మరణం శెట్టిబలిజ సమాజానికి తీరని లోటు – కుటుంబాన్ని కుడుపూడి సత్తిబాబు పరామర్శ**



**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ జిల్లా, కొత్తపేట నియోజకవర్గం, ఆలమూరు మండలం, పెనికేరు గ్రామానికి చెందిన గుత్తుల కృష్ణమూర్తి అనారోగ్య కారణాలతో ఇటీవల మృతి చెందగా, గురువారం సాయంత్రం రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు వారి నివాసానికి వెళ్లి ఆయన చిత్ర పటానికి పుష్పాలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. గుత్తుల కృష్ణమూర్తి మరణం కుటుంబానికి, శెట్టిబలిజ సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ధైర్యం మరియు మనోబలం కలగాలని ఆకాంక్షించారు. ఈయన రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గుత్తుల వీరబ్రహ్మం గారికి సోదరుడు అని, ఆలమూరు మండల శెట్టిబలిజ సంఘం ప్రధాన కార్యదర్శి గా గుత్తుల కృష్ణమూర్తి సమాజ సేవలో విశేష పాత్ర పోషించారని కొనియాడారు. శెట్టిబలిజ సంఘ అభివృద్ధికి, సామాజిక సేవా కార్యక్రమాలకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు.

## యువత బాధ్యతగా మొక్కలు నాటాలి

**పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలి**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వికసిత భారతను పురస్కరించుకొని రాజమహేంద్రవరం ఆదిత్య డిగ్రీ కళాశాలలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్స్ లక్ష్మీ సరోజ రెహమాన్లు పర్యావరణ పతాకాన్ని ఆవిష్కరించి విద్యార్థులతో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జివిఎస్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ప్రజలలో పర్యావరణ పరిరక్షణ అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ కళాశాల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీ సరోజ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జి వి ఎస్ నాగేశ్వరరావు, డాక్టర్ రమాదేవి, ఏబీవీపీ సత్య, ఎన్విరాన్మెంట్ సిద్ధార్థ బ్రహ్మకుమారీస్, పార్వతీ, భవానీ పాల్గొని విద్యార్థులకు పర్యావరణ ప్రాధాన్యతను వివరించారు ఎస్పీ గంగిరెడ్డి మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడకపోతే మానవ మనుగడేలేదని అందుకే అందరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ సరోజ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడటం యువత బాధ్యత అని నేటి చెట్టు రేపటి తరాన్ని బ్రతికిస్తుందని అందుకే ప్రతి విద్యార్థి మీ పుట్టిన రోజున ఓ మొక్క నాటాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. బ్రహ్మకుమారిస్ నుంచి పార్వతి భవాని పాల్గొని పర్యావరణ పరిరక్షణపై సూచించారు. ఎన్విరాన్మెంట్ ఎనలిస్ట్ సిద్ధార్థ మాట్లాడుతూ మొక్కలు నాటితే సరిపోదని వాటిని పరిరక్షించే బాధ్యత కూడా తీసుకోని నేటి యువత భావితరాలకు ఆదర్శం కావాలని పిలుపునిచ్చారు.

### ప్లాస్టిక్ వినియోగాన్ని

## తగ్గించాల్సిన ఆవశ్యకతపై అవగాహన

**పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ : హెచ్ఆర్‌పీఏసీఐ**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని "హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ అండ్ అవేర్నెస్ కౌన్సిల్ అఫ్ ఇండియా" ఆధ్వర్యంలో నేడు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. సత్యగుమ్మాపు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో నే మానవాళి మనుగడ ఉంది, "పరిశుభ్రమైన పర్యావరణం ప్రతి మనిషి హక్కు" అనే సందేశంతో ప్రజల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతను పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. సభ్యులు మొక్కలు నాటడం, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాల్సిన ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పర్యావరణ కాలుష్యం వల్ల మానవ ఆరోగ్యం, జీవ వైవిధ్యం, భవిష్యత్ తరాలపై పడే ప్రభావాలను వివరించి, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తగరం సురేష్ బాబు ఉచితంగా మొక్కలు అందచేయడం జరిగింది. సంస్థ ఆధ్వర్యంలో సత్య గుమ్మపు డాక్టార్ కే ఎం జగదీష్ మొక్కని అందచేసి స్థానిక బాబా నగర్ లో మొక్కని నాటి దాని భాద్యత, సంరక్షణ ని చూడాలని జగదీష్ తొ ప్రతిజ్ఞ చేయంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో సత్య గుమ్మాపు, డాక్టర్ కె ఎం జగదీష్, బిందు చౌదరి, కొమ్మిరెడ్డి ప్రభావతి, పిచ్చుక మహేష్, పగడాల కిషోర్, గొల్లవెల్లి శ్రీనివాస్, గుంటూరు రమణ, జొన్నకూటి వర్ధన్ కుమార్, ఎరువ మీనాక్షి తదితరులు పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ మద్దతును తెలిపారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో చైతన్యం తీసుకువస్తాయని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.

### రాజమహేంద్రి విద్యాసంస్థలో

## ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం


**మొక్కలు నాటిన రాజమహేంద్రి విద్యార్థులు, సిబ్బంది**
**ప్రకృతి వనరుల పరిరక్షణ, పరిశుభ్రమైన పర్యావరణం కాపాడుకోవాలి**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంపత్ నగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్, రాజమహేంద్రి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని విద్యాసంస్థల ప్రాంగణంలోని వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ టి.వి.డి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రకృతి వనరుల పరిరక్షణ, పరిశుభ్రమైన పర్యావరణం కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. స్కూల్ ఛైర్మన్ టీ.కె.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ సుస్థిర భవిష్యత్తు కోసం సామూహిక కృషి అవసరమని తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి, వాటికి ప్రతిరోజూ నీరు పోసి పెద్ద చెట్లుగా పెంచాలని విద్యార్థులను ప్రోత్సహించారు. పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి హరిత, ఆరోగ్యకరమైన భూమి కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయడంతో కార్యక్రమం ముగిసింది.

## రజా మసీదుకు నూతన కమిటీ ఏర్పాటు


అధ్యక్షులు : అబ్దుల్ రెహమాన్ ఖాన్


కార్యదర్శి : అహ్మద్ అలీ బేగ్


కోశాధికారి : షేక్ ఖాదర్ వలి


**ధవళేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** 1892 సంవత్సరంలో నిర్మించిన 134 సంవత్సరాల చరిత్ర కలిగిన స్థానిక ధవళేశ్వరం రథం వీధిలో వున్న రజా మసీదు (పెద్ద మసీదు)నకు శుక్ర వారం నమాజ్ అనంతరం నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతన కమిటీ అధ్యక్షులుగా అబ్దుల్ రెహమాన్ ఖాన్,కార్యదర్శి గా అహ్మద్ అలీబేగ్, కోశాధికారిగా షేక్ ఖాదర్ వలిలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈరోజు నుండి వీళ్ళ కార్యవర్గం ఐదు సంవత్సరాలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని గౌరవ అధ్యక్షులు షహీన్ ఇక్బాల్ తెలిపారు. ఈ కార్యవర్గంలో గౌరవ అధ్యక్షులుగా షహీన్ ఇక్బాల్, మస్తాన్ బేగ్,ఆదం బాషాలు, ఉపాధ్యక్షులుగా మస్తాన్ వలి, కరిముల్లా, సహాయ కార్యదర్శులుగా మదీన, సయ్యద్ బాజీ, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కరీంబాష, షేక్ బాజీ, సాహెబ్, ఉప కోశాధికార్లుగా అబ్దుల్ రజాక్, సభ్యులుగా షుకూర్, సత్తార్ బేగ్, ఇర్ఫాన్, అహ్మద్ దాలి, సుభానీ, ఖాజావలిలను ఎన్నుకున్నారు.

### యాక్టివిటీ రీజనింగ్ చార్జీల పేరుతో

# రూ.8వేలు వసూలు

**ఫీజు డిమాండ్ చేసే స్కూళ్ళ గుర్తింపు రద్దు చేయాలి**
**అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి - తల్లిదండ్రులకు ఆ ఫీజు తిరిగి ఇప్పించాలి**

### అధ్యక్షుడు కొమ్ము సత్తిబాబు డిమాండ్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లాలో ఆర్టీఈ 12(1)సి కింద అడ్మిషన్ పొందిన విద్యార్థుల నుంచి ప్రైవేటు స్కూళ్ళు యాక్టివిటీ రీజనింగ్ చార్జీల పేరుతో రూ.8 వేలు వసూలు చేస్తున్నాయని ఉచిత విద్యా విద్యార్థి తల్లిదండ్రుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్ము సత్తిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఫీజు కట్టకపోతే పుస్తకాలు, యూనిఫాం ఇవ్వబోమని, క్లాసులో కూర్చో నిచ్చేదిలేదని బెదిరిస్తున్నారని ఆయన తెలిపారు. ఆర్టీఈ చట్టం సెక్షన్ 12(1)సి ప్రకారం25 శాతం సీట్లు ఉచిత,నిర్బంధ విద్య కిందకు వస్తాయని, ప్రైవేటు స్కూళ్ళలో ఇలా ఉచిత సీట్లు పొందిన విద్యార్థుల నుంచి ఎటువంటి ఫీజు,డొనేషన్,ఇతర చార్జీలు తీసుకోరాదని కొమ్ము సత్తిబాబు స్పష్టం చేశారు. కలెక్టర్,జిల్లా విద్యాశాఖ అధికారి వెంటనే జోక్యం చేసుకుని ఆర్టీఇ సీట్ల విషయంలో ఎటువంటి అదనపు ఫీజు వసూలు చేయరాదని ఆదేశాలు జారీ చేయాలని ఆయన కోరారు. ఇప్పటికే రూ.8 వేలు వసూలు చేసిన స్కూళ్ళ నుంచి ఆ డబ్బు వెంటనే రిఫండ్ చేయించాలని డిమాండ్ చేశారు. ఫీజు డిమాండ్ చేసే స్కూళ్ళ గుర్తింపు,రెన్యువల్ రద్దు చేయాలని కోరారు. ప్రతి మండలంలోను ఎంఈవో ద్వారా స్కూళ్ళు తనిఖీ చేయించి ఫీజు వసూలు చేయకుండా కట్టు దిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇది పేద తలిదండ్రులపై ఆర్థిక భారం మోపే చర్య అని, 1500 మంది పిల్లల భవిష్యత్తుకు సంబంధించిన ఈ సమస్యపై వెంటనే అధికారులు స్పందించి న్యాయం చేయాలని కొమ్ము సత్తిబాబు కోరారు. ఈ మేరకు కలెక్టర్,జిల్లా విద్యాశాఖ అధికారికి ఆయన వినతి పత్రాలు అందచేశారు. వీటి కాపీలను సమగ్ర శిక్ష అధికారి బి.శ్రీనివాసరావు,పాఠశాల విద్యాశాఖ కమిషనర్, స్కూలు ఎడ్యుకేషన్ ఆర్జేడి,అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ కు పంపించినట్లు ఆయన తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణకు పౌరులు కృషి చెయ్యాలి

**రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భవనం ఆవరణలో తూర్పు గోదావరి జిల్లా ఆధ్వర్యంలో రుద్రాక్ష,ఉసిరి, జమ్మి, మారేడు,అశోక,పనస వంటి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ రమణ,కోశాధికారి డాక్టర్ జి.మహాలక్ష్మిలు మాట్లాడుతూ ప్రపంచం నేడు పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు,తగ్గుతున్న పచ్చదనం వల్ల వచ్చే అనర్థాలను ఎదుర్కోవడానికి ప్రతి ఒక్కరూ మెక్కలను పెంచాలని పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్సీ సభ్యులు బళ్ళా శ్రీనివాసరావు, బోను రామకృష్ణ, డాక్టర్ జె సురేష్,గోపీకృష్ణ,పద్మ,ఆర్ట్స్ కళాశాల యూత్ రెడ్ క్రాస్ సభ్యులు పీ దీప్తిశ్రీ, కె.పూజిత శ్రీలక్ష్మి, భావన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జ్వాలాపురం శ్రీకాంత్ వ్యాఖ్యలపై తేజోమూర్తుల ఆగ్రహం

**కూటమి ప్రభుత్వం బ్రాహ్మణుల సంక్షేమానికి కట్టుబడి ఉందని వెల్లడి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ దేవాదాయ సలహాదారుడు, వైసీపీ నాయకుడు జ్వాలాపురం శ్రీకాంత్ బ్రాహ్మణ కార్పొరేషన్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన సీనియర్ నాయకుడు తేజోమూర్తుల లక్ష్మీ నరసింహమూర్తి అభ్యంతరం వ్యక్తం చేసారు. కూటమి ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమానికి కట్టుబడి ఉందన్న విషయం ఈ రెండు సంవత్సరాల పాలనలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌లు నిరూపిం చడం జరిగిందన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పడిన తరువాత దేవాదాయ శాఖలో ఉన్న కార్పొరేషన్ ను వైసీపీ ప్రభుత్వం వచ్చాక బీసీ కార్పొరేషన్ లో కలిపేసిందని,బ్రాహ్మణ కార్పొరేషన్ ఆఫీస్ కి సైతం తాళాలు వేసింది వైసీపీ కాదా అని శ్రీకాంత్ ను ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మరలా కార్పొరేషన్ ను దేవాదాయ శాఖలో విలీనం చేయడానికి కార్పొరేషన్ చైర్మన్ ప్రయత్నాలు చేస్తున్నారనీ అన్నారు. త్వరలోనే బ్రాహ్మణ కార్పొరేషన్ దేవాదాయ శాఖలో విలీనం అవుతుందని తెలియజేశారు. టీటీడీ వేద పండితులకు త్వరలోనే చతుర్వేదముల పోస్టులు భర్తీ చేయాలని కూడా ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. అలాగే కార్పొరేషన్ పథకాల్లో గరుడ పథకం అతి తొందరలోనే ప్రారంభం అవుతుందని తెలిపారు. వార్షిక ఆదాయం 50 వేలు పైనున్న ఆలయాల్లో అర్చకులకు కనీస వేతనం 15,000 పెంచి, అర్చకులకు ధూప,దీప నైవేద్యాల కింద 5,000 నుంచి 10,000 రూపాయలు చేసింది కూటమి ప్రభుత్వం అని, ప్రతినెలా ఒకటో తారీఖున అర్చకులకు జీతాలు పడేలా కార్పొరేషన్ ప్రయత్నం చేస్తున్నట్లు తేజోమూర్తులు తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో అర్చకులపై దాడి చేసిన వారికి తగిన శిక్ష పడేలా ప్రత్యేక కమిషన్ త్వరలోనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వం దృష్టికి ఇప్పటికే కార్పొరేషన్ చైర్మన్ వెళ్లారని, క్రెడిట్ సొసైటీ ద్వారా ఇప్పటి వరకు 337.38 కోట్లు బ్రాహ్మణులకు లబ్ధి చేకూరిందన్నారు. క్రెడిట్ సొసైటీలో సభ్యత్వం కట్టిన సభ్యులకు 2017 నుంచి 2022 వరకు సుమారు 12,500 మందికి 8 కోట్ల రూపాయలు డివిడెంట్ ఇవ్వడం జరిగిందని, మరి కొంతమందికి డివిడెంట్ ఈ సంవత్సరం ఆఖరిలో ఇవ్వటానికి కార్పొరేషన్ ప్రయత్నం చేస్తున్నామని ఈ సందర్భంగా తేజోమూర్తుల పేర్కొన్నారు. ఈ విషయాలను శ్రీకాంత్ తెలుసుకుని మాట్లాడితే మంచిదని కార్పొరేషన్ మీద లేనిపోని అబద్ధాలు మాని, వైసీపీ ఇచ్చిన స్క్రిప్ట్ చదువటం మానుకోవాలని తేజోమూర్తుల మూర్తి హితవు పలికారు.



### పెళ్లైన 10ఏళ్లకు విడాకులు..

# కట్ చేస్తే 7ఏళ్ల చిన్నవాడితో డేటింగ్..




సినిమా ఇండస్ట్రీలో లవ్ స్టోరీలు, బ్రేకప్ లు, ఎఫైర్స్, పెళ్లి, విడాకులు చాలా కామన్ అయిపోయాయి.. కానీ సెలబ్రెటీల విషయంలో జరిగితే మాత్రం అది వార్తే ఎందుకంటే వాళ్ళు పబ్లిక్ ఫిగర్స్. జనాలు సెలబ్రెటీల లైఫ్‌లో జరిగే ప్రతి దాని పై ఓ కన్నేసి ఉంటారు. ఇక సినిమా ఇండస్ట్రీలో రిలేషన్స్ షిప్స్ గురించి నిత్యం వార్తలు వింటూనే ఉంటాం.. హీరో హీరోయిన్స్ లవ్ స్టోరీలు నెట్టింట చక్కర్లు కొడుతుంటాయి. ముఖ్యంగా హీరోయిన్స్.. కొంతమంది ఇద్దరు ముగ్గురిని పెళ్లి చేసుకున్న భామలు కూడా ఉన్నారు. అలాగే ఇంకొంతమంది ముగ్గురు నలుగురితో లవ్ ట్రాక్స్ నడిపి ఆతర్వాత వేరే వాడిని పెళ్లి చేసుకున్న వారు లేకపోలేదు. కాగా వీళ్లందరిలో ఈ అమ్మడు కాస్త డిఫరెంట్.. పెళ్ళికి ముందే తల్లైంది.. ఆతర్వాత పెళ్లి చేసుకుంది.. ఇప్పుడు భర్తతో విడిపోయి.. తనకన్నా వయసులో చిన్నవాడితో ఎఫర్ నడుపుతుంది. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? ఆమె ఓ క్రేజీ హీరోయిన్ కానీ స్టార్ డమ్ అందుకోవడానికి చాలా కష్టపడుతుంది. ఇండస్ట్రీలో వరుస సినిమాలతో దూసుకుపోతున్నా.. స్టార్ హీరోయిన్ అవ్వలేకపోయింది. పెళ్ళికి ముందే ప్రెగ్నెంట్ అయ్యింది. ఆతర్వాత పెళ్లి చేసుకుంది. పెళ్లైన 10ఏళ్ల కు విడాకులు తీసుకుంది. ఆ తర్వాత తనకన్నా వయసులో ఏడేళ్లు చిన్నవాడితో రిలేషన్ లో ఉంది. ఆమె మరెవరో కాదు కొంకణ సేన్ శర్మ. బాలీవుడ్ లో ఈ చిన్నది చాలా పాపులర్. ఆమె నటి అపర్ణా సేన్ కుమార్తె. కొంకణ సేన్ రెండు జాతీయ చలనచిత్ర అవార్డులు, నాలుగు ఫిల్మ్‌ఫేర్ అవార్డులను అందుకుంది. బెంగాలీ, హిందీ సినిమాలతో ప్రేక్షకులను మెప్పించింది అలాగే ఇంగ్లిష్ లోనూ సినిమాలు చేసి ఆకట్టుకుంది. సినిమాలతో పాటు టీవీ సీరియల్స్ నటించి మెప్పించింది . అలాగే వెబ్ సిరీస్ ల్లోనూ నటించింది. అలాగే దర్శకురాలిగాను చేసింది కొంకణ సేన్ శర్మ. కొంకణా 2007లో రణవీర్ షోరేతో డేటింగ్ చేసింది. పెళ్ళికి ముందే కొంకణ ప్రెగ్నెంట్ అయ్యింది. 2010లో రణ్‌వీర్, కోంకణా పెళ్లి చేసుకున్నారు. 2011 సంవత్సరంలో, కొంకణా కొడుకు హరూన్‌కు పుట్టాడు. ఇక పెళ్లైన పదేళ్ల తర్వాత ఈ ఇద్దరూ విడిపోయారు. ఇక ఇప్పుడు మరో వ్యక్తితో డేటింగ్ చేస్తుంది. అమోల్ పరాశర్‌తో డేటింగ్ చేస్తున్నట్లు తెలుస్తుంది. కొంకణా కంటే 7 సంవత్సరాలు చిన్నవాడు. ఇది సోషల్ మీడియాలో ఓ రేంజ్‌లో ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది.

# క్రిస్టోఫర్ నోలన్ నయా మూవీ..

### ఇండియాలో ది ఒడిస్సీ అడ్వాన్స్ బుకింగ్స్ మొదలయ్యేది అప్పుడే..




ఇండియాలో క్రిస్టోఫర్ నోలన్ సినిమాలకు మంచి క్రేజ్ ఉంటుంది. ఇక ఇప్పుడు ఆయన తెరకెక్కిస్తున్న కొత్త సినిమా 'ది ఒడిస్సీ' IMAX. ఈమూవీ అడ్వాన్స్ బుకింగ్స్ జూన్ 8 నుంచి ప్రారంభంకానున్నాయి. జూన్ 8న భారతీయ అభిమానులు ప్రపంచంలోనే మొదటి వారిలో ఒకరిగా సీట్లు బుక్ చేసుకోనున్నారు. ఇండియాలో హాలీవుడ్ సినిమాల క్రేజ్ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పటికే ఎన్నో హాలీవుడ్ సినిమాలు తెలుగుతో పాటు ఇండియాలోని ఇతరభాషల్లోనూ విడుదలై సూపర్ హిట్స్ గా నిలిచాయి. ఇక ఇప్పుడు మన తెలుగు సినిమాలు కూడా హాలీవుడ్ లో విడుదలవుతున్నాయి. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన ఈగ, ఆర్ఆర్ఆర్ లాంటి సినిమాలు హాలీవుడ్ ప్రేక్షకులను కూడా అలరిస్తున్నాయి. ఇక ఇప్పుడు మరో హాలీవుడ్ సినిమా మన దగ్గర సందడి చేయడానికి రెడీ అవుతుంది. ఆ సినిమా మరేదో కాదు. ది ఒడిస్సీ. క్రిస్టోఫర్ నోలన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న'ది ఒడిస్సీ'. అకాడమీ అవార్డు విజేత దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ రూపొందించిన మిథిక్ యాక్షన్ ఎపిక్ 'ది ఒడిస్సీ' చిత్రం IMAX అడ్వాన్స్ టికెట్ బుకింగ్స్ భారతదేశంలో జూన్ 8, 2026 నుంచి ప్రారంభంకానుంది. ప్రపంచవ్యాప్తంగా అత్యంత భారీ ప్రతీక్షతో రాబోతున్న ఈ చిత్రం, సినిమా చరిత్రలోనే పూర్తిగా IMAX కెమెరాలతో చిత్రీకరించిన మొదటి ఫీచర్ ఫిల్మ్ కావడం విశేషం. ఆధునిక IMAX ఫిల్మ్ టెక్నాలజీని ఉపయోగించి ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో చిత్రీకరించిన ఈ సినిమా, జూలై 17, 2026న భారతదేశంతో సహా ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతుంది. హోమర్ రచించిన ఐక్యానిక్ ఎపిక్ 'ఒడిస్సీ'ని ఇప్పటికిప్పుడు ఎప్పుడూ చూడని విధంగా తెరకెక్కించిన ఈ చిత్రంలో ఒడిస్సీ పాత్రలో మ్యాట్ డామన్, టెలిమాకస్ పాత్రలో టామ్ హాలండ్, పెనెలోప్ పాత్రలో ఆన్ హాథవే నటిస్తున్నారు. ఇంకా జెండయా, రాబర్ట్ ప్యాటిన్సన్, లుపితా న్యాంగ్‌ఓ, చార్లీజ్ థెరాన్, జాన్ బెర్న్‌తాల్ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ ఇండియా వైస్ ప్రెసిడెంట్ అలాగే మేనేజింగ్ డైరెక్టర్ డెన్జిల్ డయాస్ మాట్లాడుతూ.. 'ది ఒడిస్సీ' సినిమా చరిత్రలోనే పూర్తిగా IMAX కెమెరాలతో చిత్రీకరించిన మొదటి చిత్రం. దీన్ని సాధించడానికి క్రిస్టోఫర్ నోలన్ దాదాపు ఇరవై సంవత్సరాలు కృషి చేశారు. జూన్ 8 నుంచి భారతదేశంలోని నోలన్ అభిమానులు ప్రపంచంలోని ఇతర అభిమానులతో పాటు తమకు నచ్చిన సీట్లను బుక్ చేసుకునే అవకాశం లభించడం చాలా విశేషం. ఇది భారతీయ నోలన్ అభిమానులకు ఎన్నో జ్ఞాపకాలు మిగులుస్తుందని అన్నారు. ది ఒడిస్సీ సినిమా జూన్ 8, 2026 నుంచి IMAX టికెట్లు అందుబాటులో ఉంటాయి. చిత్రం జూలై 17, 2026న భారతదేశంలోని అన్ని ఫార్మా ట్లలో విడుదలవుతుంది.

### కోహ్లీ స్థానంలో రుతురాజ్ అనుకుంటే..

# కట్ చేస్తే శ్రీలంకలో ల్యాండ్ అయ్యాడు!



జూన్ 13 నుంచి ధర్మశాల వేదికగా ఇరు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. 2027 వన్డే వరల్డ్ కప్‌ను దృష్టిలో ఉంచుకుని యువ ఆటగాళ్లను పరీక్షించేందుకు బీసీసీఐకి ఇది మంచి అవకాశం అయినప్పటికీ, కోహ్లీ గాయం వార్త ఇప్పుడు టీమ్ మేనేజ్‌మెంట్‌ను పునరాలోచనలో పడేసింది. భారత్, అఫ్గానిస్థాన్ జట్ల మధ్య త్వరలో ప్రారంభం కాబోయే వన్డే సిరీస్‌కు ముందే సెలెక్షన్ కమిటీలో తీవ్ర గందరగోళం నెలకొంది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ గాయం కారణంగా ఈ సిరీస్‌కు దూరం కానున్నాడనే వార్తలు వస్తున్న తరుణంలో, అతని స్థానాన్ని ఎవరు భర్తీ చేస్తారనే దానిపై ఉత్కంఠ రేగుతోంది. జూన్ 13 నుంచి ధర్మశాల వేదికగా ఇరు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. 2027 వన్డే వరల్డ్ కప్‌ను దృష్టిలో ఉంచుకుని యువ ఆటగాళ్లను పరీక్షించేందుకు బీసీసీఐకి ఇది మంచి అవకాశం అయినప్పటికీ, కోహ్లీ గాయం వార్త ఇప్పుడు టీమ్ మేనేజ్‌మెంట్‌ను పునరాలోచనలో పడేసింది.

**శ్రీలంకలో ల్యాండ్ అయిన రుతురాజ్ గైక్వాడ్**

విరాట్ కోహ్లీకి సరైన రీప్లేస్‌మెంట్‌గా చెన్నై సూపర్ కింగ్స్ (జూఖ) కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌ను సెలెక్ట్ చేస్తారని అందరూ భావించారు. కానీ, ఊహించని విధంగా రుతురాజ్ గైక్వాడ్ శ్రీలంక రాజధాని కొలంబోలో ప్రత్యక్షమయ్యాడు. ఇండియా-ఎ, శ్రీలంక-ఎ, అఫ్గానిస్థాన్-ఎ జట్ల మధ్య జరగబోయే ముక్కోణపు సిరీస్ ?లో పాల్గొనేందుకు అతడు ఇండియా-ఎ జట్టుతో కలిశాడు. సోషల్ మీడియాలో దీనికి సంబంధించిన విజువల్స్ వైరల్ అవ్వడంతో అభిమానులు షాక్‌కు గురవుతున్నారు. రుతురాజ్ శ్రీలంక టూర్‌లో బిజీగా ఉండటంతో, ఇక అఫ్గాన్ వన్డే సిరీస్‌లోకి అతడిని తీసుకునే అవకాశం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

**కోహ్లీకి అయిన గాయం ఏంటి? ఎప్పుడు జరిగింది?**

విరాట్ కోహ్లీ ఐపీఎల్ 2026 ఫైనల్ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (=జదీ) తరఫున గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన రన్‌చేజ్‌లో అద్భుతంగా ఆడి జట్టును గెలిపించాడు. అయితే, ఆ సమయంలో బాగానే కనిపించినా, ఆ తర్వాత జరిగిన వైద్య పరీక్షల్లో అతనికి తీవ్రమైన హ్యామ్‌స్ట్రింగ్ గాయమైనట్లు తేలింది. మోకాలి వెనుక భాగంలో ఉండే టెండన్ దెబ్బతినడం వల్ల ఈ సమస్య వచ్చినట్లు రిపోర్టులు చెప్తున్నాయి. ఇది చాలా అరుదుగా జరిగే గాయం కావడం గమనార్హం. దీనిపై బీసీసీఐ ఇంకా అధికారిక ప్రకటన చేయనప్పటికీ, కోహ్లీ కోలుకోవడానికి కొంత సమయం పడుతుందని తెలుస్తోంది.

**కోహ్లీ ప్లేస్‌లోకి వచ్చే ఆ ఇద్దరు రేసర్లు వీరే**

గాయపడిన రియాన్ పరాగ్ స్థానంలో రుతురాజ్ గైక్వాడ్ ఇండియా-ఎ జట్టులోకి వెళ్లడంతో.. ఇప్పుడు అఫ్గానిస్థాన్‌తో జరిగే వన్డే సిరీస్ కోసం సెలెక్టర్లు వేరే ఆప్షన్లను వెతుకుతున్నారు. ఈ రేసులో దేవదత్ పడిక్కల్ పేరు బలంగా వినిపిస్తోంది. లిస్ట్-ఎ క్రికెట్‌లో పడిక్కల్ 42 మ్యాచ్‌లలో ఏకంగా 82.23 సగటుతో 2,796 పరుగులు చేసి అద్భుతమైన రికార్డును కలిగి ఉన్నాడు. అతనితో పాటు ఐపీఎల్ 2026లో దుమ్మురేపిన రజత్ పటీదార్ పేరు కూడా పరిశీలనలో ఉంది. పటీదార్ 77 లిస్ట్-ఎ మ్యాచ్‌లలో 99.17 స్ట్రైక్ రేట్‌తో 2,278 పరుగులు చేశాడు. ఒకవేళ కోహ్లీ సిరీస్ మధ్యలో కోలుకుంటే వచ్చేస్తాడని, లేదంటే వీరిద్దరిలో ఒకరికి లక్కీ ఛాన్స్ దక్కుతుందని సమాచారం.

### భారత్‌తో టెస్ట్ మ్యాచ్‌కు ముందు

# ఆఫ్ఘనిస్తాన్‌కు బిగ్ షాక్..

### స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ అవుట్




ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ జట్టుకు భారత్‌తో జూన్ 6న ముల్లాన్‌పూర్‌లో ప్రారంభం కానున్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌కు ముందే పెద్ద షాక్ తగిలింది. ఆ జట్టు స్టార్ లెగ్ స్పిన్నర్, మ్యాచ్ విన్నర్ రషీద్ ఖాన్ ఈ మ్యాచ్‌కు అందుబాటులో ఉండటం లేదు. ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ జట్టుకు భారత్‌తో జూన్ 6న ముల్లాన్‌పూర్‌లో ప్రారంభం కానున్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌కు ముందే పెద్ద షాక్ తగిలింది. ఆ జట్టు స్టార్ లెగ్ స్పిన్నర్, మ్యాచ్ విన్నర్ రషీద్ ఖాన్ ఈ మ్యాచ్‌కు అందుబాటులో ఉండటం లేదు. గత కొంతకాలంగా అతన్ని వేధిస్తున్న వెన్నునొప్పి మళ్లీ తిరగబెట్టడంతో అతను ఈ మ్యాచ్ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. రషీద్ లేకపోవడం ఆఫ్ఘన్ జట్టు బౌలింగ్ విభాగాన్ని తీవ్రంగా దెబ్బతీసే అంశమే అని చెప్పాలి. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే రషీద్ ఖాన్ టెస్ట్ క్రికెట్ భవిష్యత్తుపై ఒక కీలకమైన హింట్ ఇచ్చాడు. వెన్నునొప్పి కారణంగా తాను సుదీర్ఘమైన స్పెల్స్ వేయలేకపోతున్నానని, అందుకే రెడ్ బాల్ క్రికెట్‌కు దూరం అవ్వాలని ఆలోచిస్తున్నట్లు పేర్కొన్నాడు. 'నువ్వు ఇంకా చాలా కాలం పాటు క్రికెట్ ఆడాలనుకుంటే, ముందు ఈ రెడ్ బాల్ క్రికెట్ ఆడటం ఆపేయ్.. ఎందుకంటే నీ వెన్నుముక దీనికి సహకరించడం లేదు' అని డాక్టర్లు తనకు ఖచ్చితమైన సలహా ఇచ్చారని రషీద్ గతంలోనే ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. భారత్‌తో జరిగే టెస్ట్ మ్యాచ్‌కు ముందు జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఆఫ్ఘనిస్తాన్ హెడ్ కోచ్ రిచర్డ్ పైబస్ రషీద్ ఖాన్ ఫిట్‌నెస్, భవిష్యత్తు గురించి మాట్లాడారు. రషీద్ చాలా కాలంగా వెన్నునొప్పితో బాధపడుతున్నాడని, అతను నిరంతరాయంగా క్రికెట్ ఆడుతున్నందున తన శరీరాన్ని తనే జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అయితే, తాను స్వయంగా రషీద్‌తో మాట్లాడతానని, ఆఫ్ఘనిస్తాన్ తరఫున అతను వీలైనంత ఎక్కువ కాలం ఆరోగ్యంగా ఆడేలా చూస్తూనే, టెస్ట్ క్రికెట్‌ను కూడా ఎలా కొనసాగించవచ్చనే దానిపై చర్చిస్తానని కోచ్ నమ్మకం వ్యక్తం చేశారు. రషీద్ ఖాన్ గైర్హాజరీలో ఆఫ్ఘనిస్తాన్ జట్టును హష్మతుల్లా షాహిదీ నడిపించనున్నాడు. ఈ జట్టులో రహ్మానుల్లా గుర్బాజ్, అజ్మతుల్లా ఒమర్జాయ్, రహ్మత్ షా వంటి కీలక ఆటగాళ్లు ఉన్నారు. ముల్లాన్‌పూర్‌లోని ఎండ తీవ్రతను తట్టుకుంటూ, యువ సంచలనం శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలోని బలీయమైన టీమిండియాను ఎదుర్కోవడానికి ఆఫ్ఘన్ కుర్రాళ్లు రెడీ అవుతున్నారు. ఈ మ్యాచ్‌లో గిల్ నేతృత్వంలోని భారత జట్టును ఢీకొట్టడం ఆఫ్ఘనిస్తాన్‌కు పెద్ద సవాలుతో కూడుకున్న విషయమే. ఆఫ్ఘనిస్తాన్ జట్టు గతేడాది అక్టోబర్‌లో జింబాబ్వేతో తన చివరి టెస్ట్ మ్యాచ్ ఆడింది. ఆ మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్తాన్ ఘోర పరాజయాన్ని చవిచూసింది. కేవలం ఒక ఇన్నింగ్స్ మరియు 73 పరుగుల తేడాతో జింబాబ్వే చేతిలో ఓడిపోయింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘన్ 127 పరుగులకే ఆలౌట్ కాగా, జింబాబ్వే 359 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో కూడా ఆఫ్ఘనిస్తాన్ 159 పరుగులకే చేతులెత్తేసింది. 2018 లో టెస్ట్ హోదా సాధించినప్పటి నుంచి ఆఫ్ఘనిస్తాన్ కేవలం 12 టెస్టులు మాత్రమే ఆడింది. అందులో 4 విజయాలు, 7 ఓటములు, ఒక డ్రా ఉన్నాయి. భారత్‌తో వీరు కేవలం ఒకే ఒక్క టెస్ట్ మ్యాచ్ ఆడటం గమనార్హం.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com